నేటి కందం-నేటికి అందం

వందల కోట్ల పనులతో
కందెరలుగ నిలుప పవన కల్యాణ్ గోరన్
సుందర పిఠాపురమునకు
చెందిన రోడ్డులను ప్రభుత చేసెను వృద్ధిన్ !!

(ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో పిఠాపురం లో వందల కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రభుత్వం చేపట్టింది. దీని వలన రాక పోకలు సులభతరం అవడమే కాకుండా సరకుల రవాణా కూడా సౌకర్యవంతంగా ఉంటుంది అని అందరూ అనుకుంటున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

చివరికైనా ఆరెస్సెస్
చీఫ్ మోహన్ భగత్
పెదవిప్పి జెన్జీలకు
పలికిందు స్వాగత్.
నిరసనలపై ఇకనైనా
నిర్బంధం ఆగుతుందా
కేసులన్నీ ప్రభుత్వం
కొట్టివేయ పూనుతుందా.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 8-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక: 5 పేజీలు:6 వెల: రూ.1/-

## థాయ్‌లాండ్ స్కూల్‌లో కాల్పులు.. నలుగురి మృతి.. 15 మందికి గాయాలు..



న్యూఢిల్లీ, ఆగష్టు 7:థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఓ విద్యార్థి గన్నుతో స్కూల్లోని తోటి విద్యార్థులు, టీచర్లపై కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం తనను తాను కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనలో మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. నాంతాబురి ప్రావిన్స్, బాంగ్ కురాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ నాంతాబురి స్కూల్‌లో శుక్రవారం ఓ విద్యార్థి కాల్పులకు తెగబడ్డాడు. విచక్షణా రహితంగా తోటి విద్యార్థులు, టీచర్లను కాల్చాడు. అనంతరం తనను కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

ఈ సంఘటనలో నిందితుడితో పాటు మరో విద్యార్థి.. ఇద్దరు టీచర్లు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. దాదాపు 15 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గాయపడ్డ వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై థాయ్‌లాండ్ విద్యాశాఖ మంత్రి ప్రసెర్ట్ జంతరారువాంగ్‌థాంగ్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ సాయం అందించాలని, ఘటనపై పూర్తి నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు.

## వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### -రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి



ములుగు, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి)జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు.

శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం- న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్‌ల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య,

ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్ సేవలు, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా జనగణన హ్యాండ్ బుక్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై క్షేత్ర సిబ్బందికి తగు శిక్షణ అందించాలని తెలిపారు. చార్జ్ అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ ఫంక్షనరీలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. నమోదయ్యేప్రతి సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. హ్యాండ్ బుక్ పార్ట్ - ఎ లో గ్రామ, పట్టణ డైరెక్టరీలు,పార్ట్ - బి లో ప్రాథమిక గణన సారాంశం ఉంటాయని తెలిపారు. మొబైల్ యాప్,వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలు పొందుపరచబడి ఉంటాయని, డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్లు సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రత పరంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్ మాత్రమే ఉపయోగించాలని, అధికారిక సమాచారాన్ని సోషల్ మీడియా / వ్యక్తిగత మెసేజింగ్ ద్వారా పంచరాదని, పని పూర్తయిన వెంటనే లాగ్ అవుట్ చేయాలని తెలిపారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విధాన నిర్ణయాలు, పరిశోధనలకు ప్రామాణిక సమాచార గ్రంథంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన అన్ని చార్జ్ అధికారులు, ఫీల్డ్ ఫంక్షనరీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాచార సేకరణ, వెబ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, భవిష్యత్ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి బలమైన పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగష్టు 7: చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు.

గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎఐటఋ ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఏపీ ప్రతిష్ఠకు తగ్గట్టుగా దసరా ఉత్సవాలు.. అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు

విజయవాడ, ఆగస్టు 7: విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి ఆనంకు ఆలయ మర్యాదలతో ఈవో, ఆలయ చైర్మన్, అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానతరం వేద పండితుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను మంత్రి స్వీకరించారు. తరువాత ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వీఐపీ దర్శనాలతోపాటు సాధారణ భక్తుల దర్శనాలు కూడా సజావుగా కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, షటిల్ సర్వీసులు, అత్యవసర సేవలను ముందుగానే సిద్ధం చేయాలని సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆలయ మాస్టర్ ప్లాన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడొద్దని అధికారులకు మంత్రి స్పష్టమైన సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను రాష్ట్ర ప్రతిష్ఠకు తగ్గట్టుగా అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం.. ఆలయాల అభివృద్ధి, భక్తుల సంక్షేమానికి కట్టుబడి ఉంది మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా: సీఎం విజయ్



చెన్నై, ఆగష్టు 7: తమిళనాడు సీఎం విజయ్ ఇవాళ రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. కావేరి జల వివాదం నేపథ్యంలో.. తమిళనాడు ప్రయోజనాల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరి అంశంలో రాజకీయం చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. మేకదాతు డ్యామ్ అంశంలో రాష్ట్రం తమ హక్కులను ఎప్పటికీ వదులుకోదన్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. కావేరి జల వివాదంపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. కానీ మేకదాతు డ్యామ్ అంశంలో కర్నాటక సర్కారు మాత్రం దూసుకెళ్తున్నట్లు చెప్పారు.

టీవీకే సర్కారుపై వస్తున్న విమర్శలకు విజయ్ కౌంటర్ ఇచ్చారు. తమిళనాడు జీవాధారం కావేది నది అన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. తమిళనాడు జలహక్కుల కోసం కావేరి అంశంలో కర్నాటక సర్కారుతో చర్చలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం విజయ్ అన్నారు. అసెంబ్లీ పాస్ చేసిన తీర్మానాన్ని ప్రధాని మోదీకి పంపామని, మేకదాతు అంశంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో తీర్మానాన్ని సపోర్టు చేశారన్నారు.

కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి కూడా లేఖ రాసినట్లు విజయ్ తెలిపారు. కావేరి అంశంలో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసినట్లు చెప్పారు. 1969 నుంచి కర్నాటక డ్యామ్ ప్రాజెక్టుల అంశంలో తమిళనాడు చర్చలు నిర్వహిస్తోందన్నారు. కావేరి జల వివాదాన్ని పరిష్కరించేందుకు కర్నాటక సీఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు. దీని కోసం బెంగుళూరు కూడా వెళ్లనున్నట్లు సీఎం విజయ్ చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు శత్రు దేశాలు కూడా చర్చలు నిర్వహిస్తాయని, పక్క రాష్ట్రంతో మాట్లాడాలని నిర్ణయించానని, బెంగుళూరులో అవమానిస్తే ఏం చేస్తారని ప్రతిపక్షాలు అంటున్నాయని, అయితే తమిళనాడు ప్రజల కోసం అవమానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు విజయ్ తెలిపారు.

## ఆందోళన వద్దు.. నేను మీతోనే ఉన్నా: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగష్టు 7: ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. పార్లమెంట్ సమావేశాల్లో ఇటీవల జరుగుతున్న ఆందోళనలు, అంతరాయాలతో కొత్తగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగాలని, ప్రతి సభ్యుడూ తన అభిప్రాయాలను వెల్లడించేందుకు అవకాశమివ్వాలన్నారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎన్‌డీఏ ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన అల్పాహారం కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. అందులోని చర్చలు, సమాచారాన్ని తెలుసుకుని తమ ప్రసంగాలను ప్రభావవంతంగా కొనసాగించాలని కోరారు. దేశాభివృద్ధి అనేది రాష్ట్రాల ప్రగతిపైనే ఆధారపడి ఉంటుందన్న ప్రధాని.. ప్రతీ ఎంపీ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయా పురోగతి పనులకు సంబంధించి అవసరమైతే నేరుగా తన కార్యాలయాన్ని(పీఎంఓ) సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. పేదలు, కార్మికులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలతో ఎంపీలు కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు.

ఈ సమావేశానికి శివసేన నుంచి ఏడుగురు, ఎన్‌సీపీఐ తరఫున 20 మంది, ఎన్‌సీపీ(అజిత్ పవార్ వర్గం) నుంచి ఇద్దరు సహా మొత్తం సుమారు 45 మంది ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల టీఎంసీని వీడి ఎన్‌డీఏలో చేరిన ఎంపీలు, అలాగే ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన మాజీ శివసేన ఎంపీలకు ప్రధాని ప్రత్యేక భరోసానిచ్చారు. 'ఎన్‌డీఏ అనేది ఓ కుటుంబం. ఈ కూటమిలోని ప్రతి పార్టీకి చెందిన ఎంపీకి సమానమైన గౌరవం ఉంటుంది. నేను ఒక పార్టీకి మాత్రమే కాదు.. ప్రతి ఎంపీకి అండగా ఉంటాను. ఇందులో ఎలాంటి ఆందోళనా అవసరం లేదు' అని మోదీ చెప్పుకొచ్చారు. భేటీ అనంతరం ఒక్కో ఎంపీతో విడివిడిగా మాట్లాడిన మోదీ.. వారి వారి నియోజకవర్గాల పరిస్థితులు, అక్కడి ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు.

అంతకుముందు రోజు కూడా తన నివాసంలో బీజేపీకి చెందిన 37 మంది ఎంపీలతో విందు నిర్వహించారు మోదీ. పాలన, పార్లమెంటు వ్యవహారాలు, ప్రజా సేవలపై వారితో అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే ఢిల్లీలోని రాజకీయ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని, ప్రతిపక్ష సభ్యులతోనూ సత్సంబంధాలు కొనసాగించాలని ఎంపీలకు మోదీ సూచించినట్టు తెలుస్తోంది.

## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) యాక్ట్-2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది.

ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది.

తాజాగా నిబంధనల ప్రకారం, జాతీయ గీతం లేదా గేయం ఆలాపనను అడ్డుకున్న వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.

ఈ పాటల ఆలాపన జరుగుతున్న సమయంలో అడ్డంకులు సృష్టించేవారికీ ఇవే శిక్షలు విధిస్తారు. అంతకుముందున్న చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, కేవలం జాతీయ గీతానికి ఈ రక్షణలు ఉండేవి. ప్రస్తుతం వందేమాతరం గేయానికీ ఇవే రక్షణలు కల్పిస్తూ చట్టంలో మార్పులు చేశారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

### – పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): ఆగస్టు 15 న జరగబోయే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తలపెట్టిన హర్ ఘర్ తిరంగా ప్రోగ్రామ్, తిరంగా యాత్రలను సక్సెస్ చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపె ల్లి శ్రీధర్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం.

స్థానిక పద్మశాలి భవన్లో రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర జిల్లా శాఖల ఆదేశాల మేరకు ప్రతినెల నిర్వహించాల్సిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో శ్రీధర్ మాట్లాడుతూ తిరంగా యాత్ర నిర్వాణ కోసం బిజెపి శ్రేణులు సమాయత్తం కావాలని, దేశభక్తిని చాటాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగంపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన నుంచి ప్రతి భారతీయుడులో దేశభక్తి పెంచే విధంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త సైనికుడిలా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు వేములవాడలో తిరంగా యాత్ర పెద్ద ఎత్తున పట్టణ ప్రజలను మమేకం చేసే నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆఫీస్ ఇంచార్జ్ గొల్లపెల్లి నీరజ్ తో కూడిన బృందం విచ్చేసి సోషల్ మీడియా పై సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర నాయకులు కోలా ఇష్ట స్వామి జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్ పిన్నింటి హనుమాన్లు వాసం మల్లేశం గుడిసె మనోజ్ నామాల శేఖర్ పట్టణ కమిటీ సభ్యులు వివేక్ రెడ్డి కటకం శ్రీనివాస్ జవ్వాజి శేఖర్ సగ్గు రాహుల్ లాలా శేఖర్ నేరెళ్ల కిరణ్ సాయికృష్ణ అన్నం నరసయ్య తదితరులు పాల్గొన్నారు

# భారత స్వాతంత్ర్య పోరులో ప్రధాన ఘట్టం : క్విట్ ఇండియా ఉద్యమం

## (08 ఆగష్టు "క్రిట్ ఇండియా ఉద్యమ దినం" సందర్భంగా)

2వ ప్రపంచ యుద్ధం ఒకవైపు భారత స్వాతంత్ర్య పోరాటం మరో వైపు ఉన్నత స్థాయిలో జరుగుతున్న రోజులవి. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 08 ఆగష్టు 1942 రోజున బొంబాయిలో భారత జాతీయ కాంగ్రేస్ తీసుకున్న తీర్మానం ప్రకారం "క్విట్ ఇండియా ఉద్యమం" ఉవ్వెత్తున ఎగిసి పడింది. "ఆగష్టు ఉద్యమం" లేదా "ఆగష్టు క్రాంతి" లేదా "భారత్ ఛోడో ఆందోళన్" అనే పేర్లతో కూడా క్విట్ ఇండియా ఉద్యమాన్ని నినాదాలుగా పిలిచారు. "క్విట్ ఇండియా" అంటూ మహాత్మాగాంధీ బ్రిటీష్ పాలకుల గుండెలు అదిరే విధంగా గళమెత్తడమే కాకుండా స్వాతంత్ర్య సాధనకు "డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు)" అంటూ సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్య జ్వాలలు రగల్చగలిగారు. పట్టణాలు, పల్లెల ప్రజలు కూడా క్విట్ ఇండియా అంటూ అహింసాయుత బాటలో ముక్త కంఠంతో గొంతులు ఎత్తడంతో వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ప్రారంభమైంది. క్రిప్స్ మిషన్ వైఫల్యం, భారతీయుల్ని అమానవీయంగా చూడడం, ఈస్ట్ బెంగాల్ ప్రాంతంలో తీవ్ర అస్థిరత, దేశవ్యాప్తంగా ఆకలి పోరాటాలు, వలస పాలకులు పాలనపై అపనమ్మకం లాంటి పలు కారణాలు కూడా క్విట్ ఇండియా ఉద్యమానికి ఆజ్యం పోశాయి.

వీర మరణమో లేదా స్వాతంత్ర్య సాధనో అంటూ సాగిన పోరు :

క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రధాన నినాదంగా "డూ ఆర్ డై" అనే స్వాతంత్ర్య రెండు పదాల మంత్రం భారతదేశవ్యాప్తంగా వ్యాపించిన వేళ స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ఇతర పెద్దలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం పోరాటానికి గళం కలిపి దేశ ఐక్యతను చాటడంతో తెల్ల తోలు పాలకులు భయకంపితులి కావడం జరిగింది. ఈ పోరాటాన్ని అణచి వేయడానికి పోలీస్ బలగాలు రంగ ప్రవేశం చేసి పలువురు ప్రముఖ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. పౌర సహాయనిరాకరణ, పౌరుల్లో ధైర్యం, ప్రజల త్యాగం, దేశ స్వాతంత్ర్య భావనలు, జాతీయ అంచర్జాతీయ గుర్తింపు పౌర సమాజ భాగస్వామ్యం ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సార్వభౌమాధికారం, దేశభక్తి, రేపటి యువతరం ప్రేరణ, పెద్ద ఎత్తున నిరసనలు జరగడానికి క్విట్ ఇండియా స్ఫూర్తి పని చేసింది. 1947లో స్వాతంత్ర్యం రావడానికి క్విట్ ఇండియా ఉద్యమ ఘట్టం ప్రధాన కారణంగా నిలిచింది.

08 ఆగష్టు రోజున పాటిస్తున్న క్విట్ ఇండియా ఉద్యమ దినంలో భాగంగా విద్యాలయాల్లో అవగాహనలు, రేపటి తరానికి ప్రేరణాత్మక కార్యక్రమాలు, క్విజ్–పోస్టర్–ఉపన్యాస పోటీలు, పోరాటానికి సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, చర్చలు, పోరులో అమరత్వ పొందిన వారికి నివాళులు అర్పించడం, సాంస్కృతిక పోటీలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, ప్రభుత్వ సంస్థల కార్యక్రమాలు లాంటివి నిర్వహించవచ్చు. వీర మరణమే లేదా స్వాతంత్ర్య సాధనో జరిగే వరకు ఈ పోరాటం ఆగదని బ్రిటీష్ పాలకులకు స్పష్టం చేయగలిగినా క్విట్ ఇండియా ఉద్యమం భారత దేశ స్వేచ్ఛ పోరులో ఒక ప్రధాన ఘట్టంగా నిలవడం జరిగింది.



–మధుపాళీ
9949700037

# "స్థిరమైన జీవిత ప్రారంభానికి తల్లిపాలు: సత్ఫలితాలనిచ్చే విధానాలను బలోపేతం చేయడం" అనే ప్రధాన ఇతివృత్తంతో వారోత్సవాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 6:కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు–2026 ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది "స్థిరమైన జీవిత ప్రారంభానికి తల్లిపాలు: సత్ఫలితాలనిచ్చే విధానాలను బలోపేతం చేద్దాం" అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రచారాన్ని వేగవంతం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, సమాజిక సేవా వేదికలు, డిజిటల్ మీడియా ద్వారా వారం రోజుల పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి శిశువు జన్మించిన తర్వాత మొదటి ఆరు నెలలు, ఆపై 24 నెలల (రెండేళ్ల) వరకు ఉండే తొలి 1000 రోజుల కాలం పిల్లల పెంపకంలో అత్యంత కీలకమైనదని ఈ ప్రచారం స్పష్టం చేస్తోంది. ఈ సమయంలో లభించే సరైన పోషణ, సంరక్షణ, అప్యాయత పిల్లల మెదడు ఎదుగుదల, రోగనిరోధక శక్తి, నేర్చుకునే సామర్థ్యం, జీవితకాల ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. పిల్లల సురక్షిత భవిష్యత్తుకు, సమగ్ర వికాసానికి తల్లిపాలు పట్టడమే అత్యంత ప్రభావవంతమైన మార్గంగా నిలుస్తుంది.

శిశువు జన్మించిన మొదటి గంట వ్యవధిని గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలోనే నవజాత శిశువుకు ఖచ్చితంగా తల్లిపాలు పట్టాలని కుటుంబాలను మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. కాన్పు అయిన వెంటనే వచ్చే చిక్కటి ముర్రుపాలు అయిన కొలోస్ట్రమ్ బిడ్డకు మొదటి సహజమైన టీకా మాదిరి రక్షణను అందిస్తాయి. ముర్రు పాలు వ్యాధి నిరోధకతనూ, అత్యవసర పోషకాలతోనూ ఉంటాయి. వీటిని ఎట్టిపరి స్థితుల్లో నూ పారబోయకూడదు. కాన్పు కాగానే తల్లీ, బిడ్డల మధ్య ఉండే శరీర స్పర్శ అనుబంధం తల్లిపాలు త్వరగా పడటానికి దోహదపడటమే కాకుండా, వారిద్దరి మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

పుట్టిన ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. ఈ ఆరు నెలల కాలంలో శిశువుకు నీళ్లు, తేనె, గుత్తి, గ్లూకోజ్ లేదా ఫార్ములా పాలు లేకుండా కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలి. బిడ్డకు కావాల్సిన పోషకాలతో పాటు నీటి అవసరాలను తీర్చడానికి తల్లిపాలు ఒక్కటే సరిపోతాయి. ఇవి బిడ్డను రకరకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతాయి. ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు వయసుకు తగ్గ పోషకాహారాన్ని (అదనపు ఆహారం) అందించాలి. ఈ విధంగా రెండేళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలం తల్లిపాలు ఇవ్వడం కొనసాగించాలి.

ఈ వారోత్సవాల్లో భాగంగా తల్లులకు సరైన పద్ధతిలో పాలు పట్టడం, ఆసరా ఇవ్వడంపై కూడా మార్గనిర్దేశం చేస్తున్నారు. తల్లికీ, బిడ్డకు అత్యంత సౌకర్యవంతంగా ఉండే పద్ధతిలో పాలు పట్టేలా ప్రోత్సహిస్తున్నారు. బిడ్డ ఆకలిని బట్టి అవసరమైనప్పుడల్లా పాలు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు లేదా ఆరోగ్య కేంద్రాల సహాయం తీసుకోవాలని కోరుతున్నారు. ఉద్యోగాలకు వెళ్లే తల్లులు పాలను సురక్షితంగా తీసి, భద్రపరిచే విధానాలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు. దీనివల్ల బిడ్డకు పాల సరఫరాలో అంతరాయం కలగకుండా ఉంటుంది.

ప్రతి తల్లికి పాలు ఇచ్చే ధైర్యాన్ని, సౌకర్యాన్ని కల్పించడంలో.. ప్రతి చిన్నారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో సమాజం, కుటుంబాలు, ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు భాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది.

# 8,500 కి.మీ సోలో సైకిల్ యాత్ర పూర్తి చేసిన ఆశా మాలవీయను

న్యూఢిల్లీ, ఆగష్టు 6:సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్ ఇలా పేర్కొన్నారు.

"ప్రముఖ సోలో సైక్లిస్ట్, అథ్లెట్, పర్వతారోహకురాలైన ఆశా మాలవీయను నేడు న్యూఢిల్లీలో కలవడం ఆనందంగా ఉంది. మహిళా సాధికారత, దేశభక్తి, అజేయమైన ధైర్యసాహసాల సందేశాన్ని చాటుతూ.. దేశపు పశ్చిమ చివరి భాగం నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లోని కిబితు వరకు 8,500 కిలోమీటర్ల సుదీర్ఘమైన సోలో సైకిల్ యాత్రను ఆమె ఎంతో స్ఫూర్తిదాయకంగా పూర్తి చేశారు. ఆశా మాలవీయ సాధించిన ఈ అద్భుతమైన విజయానికి నా హృదయపూర్వక అభినందనలు. ఆమె ఇలాగే ఎంతోమంది యువతులకు పెద్ద కలలు కనేందుకు, సవాళ్లను అధిగమించి ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను"

# ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ల ఉద్దేశం, అర్హతా ప్రమాణాలను స్పష్టం చేసిన ప్రభుత్వం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 7:షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), సామాజికంగా, విద్యపరంగా వెనకబడిన తరగతుల (ఎస్ఈబీసీల) కోసం అందుబాటులో ఉన్న ప్రస్తుత రిజర్వేషన్ పథకాల పరిధిలోకి రాని, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ ప్రయోజనాలను అందించడమే ఈ రిజర్వేషన్ పాలసీ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

లోక్‌సభలో గౌరవ సభ్యులు శ్రీ విజయ్ బఘేల్ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి శ్రీ బి.ఎల్. వర్మ ఈ సమాచారాన్ని పంచుకున్నారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, సేవల్లో నియామకాలకు సంబంధించి ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 శాతం వరకు రిజర్వేషన్ కల్పించడం కోసం రాజ్యాంగ (103వ సవరణ) చట్టం–2019 ద్వారా రాజ్యాంగంలో 15(6), 16(6) ప్రకరణలను చేర్చినట్లు సభకు తెలియజేశారు.

ప్రస్తుత రిజర్వేషన్ పథకాల పరిధిలోకి రాని, రూ.8 లక్షల కంటే తక్కువ స్థూల వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకు చెందిన వ్యక్తులకు రిజర్వేషన్ ప్రయోజనం కల్పించడం కోసం వారిని ఆర్థికంగా వెనకబడిన వర్గాలు (ఈడబ్ల్యూస్)గా గుర్తిస్తారని లిఖితపూర్వక సమాధానంలో వివరించారు. కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా, ఐదు ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ వ్యవసాయ భూమి... 1,000 చదరపు అడుగులు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం గల నివాస ఫ్లాట్... నోటిఫైడ్ బల్దియాల పరిధిలో 100 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం గల నివాస స్థలం... లేదా నోటిఫైడ్ బల్దియా కాని ప్రాంతాల్లో 200 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం గల నివాస స్థలం ఉన్న కుటుంబాలకు చెందిన వ్యక్తులను ఈడబ్ల్యూఎస్ గుర్తింపు నుంచి మినహాయించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆర్థికంగా వెనకబడిన వర్గాల రిజర్వేషన్ పాలసీ అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం... ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించుటకు సంబంధించిన నిబంధనను కలిగి ఉన్న 'ది ఛత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీసెస్ (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనకబడిన తరగతుల రిజర్వేషన్) (సవరణ) బిల్లు–2022' ఇంకా ఆమోదం పొందలేదని సభకు తెలియజేశారు. ఈ కారణంగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విధానం అమలు కాలేదు.

ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించేందుకు సంబంధించిన ప్రస్తుత నిబంధనలను సమీక్షించుట లేదా సవరించుట గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా... మంత్రిత్వ శాఖలో అటువంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని సభకు తెలియజేశారు.

# సిల్క్యారా సొరంగం రక్షణ చర్యలలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన 12 మంది 'ర్యాట్–హోల్' గని కార్మికులకు 'సర్వోత్తమ జీవన్ రక్షా పతకం'

న్యూఢిల్లీ, ఆగష్టు 6:సిల్క్యారా సొరంగం ప్రమాదం సందర్భంగా రక్షణ సహాయ చర్యలలో అసాధారణ ధైర్యసాహసాలతో నిస్వార్థ సేవాభావం కనబరిచిన 12 మంది 'రాట్–హోల్' గని కార్మికులను ప్రభుత్వం సత్కరించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా–జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో 'సర్వోత్తమ జీవన్ రక్షా పతకం' ప్రదానం చేశారు. ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా, కార్యదర్శి–ఎన్‌హెచ్ఐడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ తదితర ఉన్నతాధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ గడ్కరీ మాట్లాడుతూ– సొరంగం కూలిపోయిన నేపథ్యంలో రక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టడం ఇటీవల ఎన్నడూ లేనంత సవాలుగా పరిణమించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించిందని, ఈ రక్షణ చర్యలపై అత్యున్నత స్థాయిలో నిరంతరం దృష్టి నిలిపామని తెలిపారు. ప్రధానమంత్రి స్వయంగా అన్ని పరిస్థితులనూ నిశితంగా పర్యవేక్షిస్తూ, కార్మికులందరూ సురక్షితంగా బయట పడటంలో అన్ని వనరులనూ సమీకరించేలా చూశారని వెల్లడించారు. సమర్థ రక్షణ–సహాయ వ్యూహం రూపకల్పనలో తమ శాఖతోపాటు ఎన్‌హెచ్ఐడీసీఎల్, సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ), సైనిక సిబ్బంది, ఉత్తరాఖండ్ ప్రభుత్వం, దేశవ్యాప్తంగాగల సాంకేతిక నిపుణులు సహా అనేక ఏజెన్సీల నిపుణులు సన్నిహిత సమన్వయంతో కృషి చేశారని మంత్రి కొనియాడారు. ఈ ఆపరేషన్ సందర్భంగా వర్టికల్ డ్రిల్లింగ్, ఇతర సాంకేతిక చర్యలు వివిధ ఇంజనీరింగ్ పరిష్కారాన్వేషణపై దృష్టి సారించారు.

కూలిన సొరంగ భాగంలోకి పైప్‌లైన్‌ను విజయవంతంగా చొప్పించడంలో కీలక పురోగమనం సాధించినట్లు చెప్పారు. దీనివల్ల సొరంగంలో చిక్కుకున్న కార్మికులకు ఆహారం, నీరు, మందులు, ఇతర నిత్యావసరాల సరఫరా సాధ్యమైందని శ్రీ గడ్కరీ వివరించారు. ఇరుకైన, ప్రమాదకరమైన ప్రదేశంలోకి స్వచ్ఛందంగా ప్రవేశించి, మిగిలిన శిథిలాలను చేతులతో తొలగించి, కార్మికులందర్నీ సురక్షితంగా వెలికి తేవడంలో సాయపడిన 'రాట్ మైనర్స్' అసాధారణ కృషితో సహాయక చర్యలలో అత్యంత కీలక దశ విజయవంతంగా పూర్తయిందని ఆయన పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతల ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ– ఇలాంటి అసాధారణ స్వభావం, త్యాగాలు భవిష్యత్తరాలకు సదా ఉదాహరణలుగా నిలుస్తాయని శ్రీ గడ్కరీ అన్నారు. ఇతరుల రక్షణలో తమ ప్రాణాలను పణంగా పెట్టడం ధైర్యం, ప్రజాసేవ, మానవత్వం వంటి అత్యున్నత ఆదర్శాలను ప్రతిబింబిస్తుందని చెప్పారు. వారి అమూల్య సేవను దేశం ఎన్నటికీ మరువదని ఆయన పేర్కొన్నారు.

వారందర్నీ అభినందిస్తూ– మానవ ప్రాణరక్షణలో వారి అసాధారణ ధైర్యానికి, అకుంఠిత నిబద్ధతకు సర్వోత్తమ జీవన్ రక్షా పతకం ఒక సంపూర్ణ గుర్తింపని మంత్రి అన్నారు.

# ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలి..

**–సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి..**
**–సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి..**
**–సిరిసిల్ల జిల్లా పోలీసుల పనితీరు భేష్**
**–రాజన్న జోన్– 3 డిఐజి సత్ సింగ్**

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి): ప్రజలకు చేరువగా ఉంటూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాజన్న




జోన్–3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఆయనకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఘన స్వాగతం పలికారు.

గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డీఐజీ కార్యాలయ ప్రాంగణం, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) విభాగాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, డిజిటల్ డేటా వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం అమలు తీరుపై ఆరా తీసి జిల్లా పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

తదనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సైబర్ నేరాల నివారణ, పెండింగ్ కేసుల పురోగతి, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని, ముఖ్యంగా దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన ఛేదించాలని సూచించారు. నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడే శాతాన్ని పెంచేందుకు పటిష్ఠమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో కన్విక్షన్ రేటు మెరుగ్గా ఉండటాన్ని అభినందించారు.

కోర్టు మానిటరింగ్ బృందం ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షిస్తూ, సాక్షులు విచారణకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో కనీసం ఐదు నుంచి ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి తన స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై పూర్తి సమాచారం కలిగి ఉండి, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి సేవించే వ్యక్తులపై నిఘా కొనసాగించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ఆదేశించారు.

అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది వినియోగార్థం కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను డీఐజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ సేవ
ఆహ్వానం
చిమ్మపూడి ఫౌండేషన్
హైదరాబాదు
శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం
సంయుక్త ఆధ్వర్యంలో
కథా సౌదామిని
(కథా రచయిత్రుల సమ్మేళనం)
తేది : 16-08-2026 ఆదివారం సా॥ 05-30 గం॥లకు
వేదిక : శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం, హైదరాబాదు.
ముఖ్య అతిథి & సన్మానకర్త :
డా॥ కె.వి. రమణ గారు, (ఐ.ఏ.ఎస్. రిటైర్డ్)
తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, చిమ్మపూడి ఫౌండేషన్ గౌరవ సలహాదారు
సభాధ్యక్షులు : డా॥ కొండపల్లి నీహారిణి గారు,
గౌరవ అతిథులు : శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు,
శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి గారు,
సభా సమన్వయకర్త : శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి గారు,
అధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్
కథా కథనంలో పాల్గొంటున్న రచయిత్రులు :
శ్రీమతి వారణాసి నాగలక్ష్మి గారు, శ్రీమతి గరిమెళ్ల సుబ్బలక్ష్మి గారు,
శ్రీమతి ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మి గారు, డా॥ దేవులపల్లి వాణీదేవి గారు,
శ్రీమతి గంటి భానుమతి గారు, శ్రీమతి యలమర్తి అనూరాధ గారు,
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, శ్రీమతి జ్వలిత గారు,
శ్రీమతి గంటి ఉషాబాల గారు, శ్రీమతి శైలజామిత్ర గారు,
వ్యాఖ్యానం : శ్రీమతి పి.వి.ఎల్. సుజాత గారు
వందన సమర్పణ : శ్రీ చిమ్మపూడి రవికుమార్ గారు,
ఉపాధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్
ఉడయవర్లు, కార్యదర్శి
శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం
మీ ఆగమనాభిలాషులు
చిమ్మపూడి ఫౌండేషన్ కార్యవర్గం

# భీమ్‌గల్‌లో న్యూ బ్రెజ్జా ఆవిష్కరణ




నిజామాబాద్, ఆగష్టు 7:భీమ్‌గల్‌లోని వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్–మారుతి సుజుకి అరేనా షోరూమ్‌లో అత్యాధునిక ఫీచర్లతో కూడిన న్యూ మారుతి సుజుకి బ్రెజ్జా వాహనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, ఆకర్షణీయమైన డిజైన్, మెరుగైన భద్రతా ప్రమాణాలు, అత్యుత్తమ పనితీరుతో రూపొందించిన న్యూ బ్రెజ్జా వినియోగదారులకు ఉత్తమ ఎంపికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

షోరూమ్ నిర్వాహకులు మారుతి, వేణుగోపాల్ మాట్లాడుతూ అధునాతన ఫీచర్లు, సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభూతి, మెరుగైన పనితీరుతో న్యూ బ్రెజ్జా మార్కెట్లోకి తీసుకొచ్చామని తెలిపారు. వాహనానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం వినియోగదారులు షోరూమ్‌ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో బోదిరే స్వామి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు అనంత్‌రావు, జేజే నర్సయ్య, కౌన్సిలర్లు సతీష్, సందీప్, అంజుమ్, నాయకులు నాగేంద్రబాబు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వారం రోజులుగా కొనసాగుతున్న పైప్‌లైన్ మరమ్మతులు

ఆదిలాబాద్, ఆగష్టు 7: మంచిర్యాల పట్టణానికి గోదావరి నది నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు రాళ్లవాగు వద్ద దెబ్బతినడంతో పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రంగపేట?లక్ష్మీనగర్ మధ్య ఉన్న ప్రాంతంలో పైప్‌లైన్ కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు ఆలస్యమవుతున్నాయని స్థానికులు, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే తరహా పరిస్థితుల్లో తక్కువ సమయంలోనే నీటి సరఫరా పునరుద్ధరించారని, ప్రస్తుతం మాత్రం వారం రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని విమర్శిస్తున్నారు.

ఈ విషయంపై ఆంధ్రప్రభ మున్సిపల్ కమిషనర్, నగర మేయర్‌ను వివరణ కోరగా, నాలుగు యంత్రాలతో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. అయితే రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని చెప్పినప్పటికీ ఇప్పటికీ నీటి సరఫరా ప్రారంభం కాకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# కంటైనర్ రైలు ఆపరేటర్లకు శుభవార్త... ఒకే అఖిల భారత లైసెన్సుతో అన్ని మార్గాల్లోనూ కార్యకలాపాలకు అవకాశం: మెరుగైన వాణిజ్య సౌలభ్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో కంటైనర్ రైళ్లను నడిపేందుకు ఆపరేటర్లకు అనుమతినిచ్చే మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్ (ఎంసీఏ) సవరణలకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన ఈ మార్పుల ప్రకారం.. కంటైనర్ రైళ్ల నిర్వాహకులకు (సీటీవోలు) ఒకే అఖిల భారత లైసెన్సు ద్వారా దేశవ్యాప్తంగా అన్ని మార్గాల్లో కంటైనర్ రైళ్లను నడిపేందుకు అనుమతి లభిస్తుంది. ఇందుకోసం రూ. 25 కోట్ల ఏకరూప నమోదు రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. వేర్వేరు మార్గాలకు సంబంధించిన కేటగిరీల కోసం విడివిడిగా అనుమతులు పొందాల్సిన, రుసుములు చెల్లించాల్సిన పాత విధానానికి దీంతో స్వస్తి పలకనున్నారు. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఈ మార్పుల వివరాలను విడుదల చేయనున్నారు.

**అన్ని మార్గాలకూ ఒకే లైసెన్స్**

ఆమోదించిన సవరణల్లో భాగంగా... లైసెన్సులకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న మార్గాలవారీ వర్గీకరణ విధానాన్ని రద్దు చేయనున్నారు. రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదానికి లోబడి.. కంటైనర్ రైలు ఆపరేటర్లకు ఒకే ఆలిండియా లైసెన్సును మంజూరు చేస్తారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లోని అన్ని మార్గాల్లో కంటైనర్ రైళ్లను నడిపేందుకు ఇది వారికి వీలు కల్పిస్తుంది.

**ఏకీకృత రిజిస్ట్రేషన్ రుసుము**

వివిధ మార్గాల కేటగిరీలకు వేర్వేరు రిజిస్ట్రేషన్ రుసుములను వసూలు చేసే పాత విధానానికి స్వస్తి పలికారు. ఇకపై ప్రతి దరఖాస్తుదారు రూ. 25 కోట్ల ఏకీకృత రిజిస్ట్రేషన్ రుసుమును (ఇది నాన్ రీఫండబుల్) డిపాజిట్ చేసి.. దేశంలోని అన్ని రైల్వే మార్గాల్లో రైళ్లను నడిపించవచ్చు.

**పొడిగింపునకు రుసుము లేదు**

ఆమోదించిన సవరణల ప్రకారం... కంటైనర్ రైలు ఆపరేటర్‌కు ఇచ్చిన అనుమతి గడువు ముగిసిన తర్వాత, దాన్ని మరో 20 ఏళ్ల కాలానికి పొడిగించే వెసులుబాటు ఉంటుంది. ఆపరేటర్ పనితీరు సంతృప్తికరంగా ఉంటే వారి దరఖాస్తు ఆధారంగా సంబంధిత అధికారిక సంస్థ ఈ పొడిగింపును మంజూరు చేస్తుంది. ఈ పొడిగింపునకు గానీ, లేదా భవిష్యత్తులో ఆ ఆపరేటర్‌కు ఇచ్చే తదుపరి పొడిగింపులకు గానీ ఎలాంటి రుసుమూ వసూలు చేయబోరు.

**ప్రస్తుత ఆపరేటర్లకు ఉపశమనం**

ఇప్పటికే కేటగిరీ-ఎ లైసెన్సులు ఉన్న ఆపరేటర్లు తమ రాయితీ కాలం ముగిసే వరకు వారి ప్రస్తుత కేటగిరీలోనే కొనసాగవచ్చు. కొత్త లైసెన్సు కింద పునరుద్ధరణ లేదా పొడిగింపులపై వారికి ఎటువంటి రుసుమూ ఉండదు.

కేటగిరీ ఎఎ, ఎఎఎ, ఎఎల లోని నిర్వాహకులు తమ రాయితీ కాలం ముగిసే వరకు ప్రస్తుత కేటగిరీల్లోనే కొనసాగవచ్చు. కొత్త లైసెన్స్ కింద పునరుద్ధరణ లేదా పొడిగింపు కోసం వారు రూ. 15 కోట్లు చెల్లించాలి. రూ. 25 కోట్ల కొత్త రుసుముకూ, ఇప్పటికే వారు చెల్లించిన రూ. 10 కోట్లకూ మధ్య ఉన్న వ్యత్యాసానికి ఈ మొత్తం సమానం. ఈ మొత్తాన్ని వాపసు పొందే అవకాశం లేదు.

ఈ ఆపరేటర్లు తమ 20 ఏళ్ల రాయితీ కాలం పూర్తి కాక ముందే, ముందుగానే కొత్త లైసెన్సుకు మారే అవకాశం కూడా ఉంది. ముందుగానే మారాలనుకున్నా కూడా అదే రూ. 15 కోట్ల మొత్తాన్ని వారు చెల్లించాల్సి ఉంటుంది.

**పరిశ్రమకు ప్రయోజనాలు**

ఒకే రిజిస్ట్రేషన్ రుసుము, పొడిగింపు రుసుముల రద్దు వంటి నిర్ణయాల వల్ల అనుమతుల ప్రక్రియ సరళతరం కావడంతోపాటు ఆపరేటర్లకు నిబంధనలు, నిర్వహణ వ్యయాన్ని తగ్గిస్తాయని భావిస్తున్నారు.

సరళీకృత లైసెన్సింగ్ విధానం ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి, కంటైనర్ రైళ్ల కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుంది. తద్వారా దేశవ్యాప్తంగా రైల్వేల ద్వారా సరుకు రవాణా మెరుగుపడుతుంది. కంటైనర్ రవాణాకు రైల్వేను ఎక్కువగా వినియోగించడం వల్ల.. సమర్థంగా, తక్కువ ఖర్చుతో సరుకు రవాణాకు అవకాశం లభిస్తుంది. దీంతో పరిశ్రమలకూ, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకూ సరుకు రవాణా వ్యయం తగ్గుతుంది.

కంటైనర్ రవాణాను రోడ్డు మార్గం నుంచి రైల్వేల వైపు మళ్లించడం వల్ల హైవేలపై రద్దీ తగ్గడమే కాకుండా, ఇంధన వినియోగం తగ్గి కర్బనోద్గారాలు నియంత్రణలోకి వస్తాయి. మరింత సుస్థిర పద్ధతుల్లో సరుకు రవాణా వ్యవస్థకు ఇది తోడ్పడుతుంది.

**ఒకేరకమైన, సరళీకృత లైసెన్సింగ్ విధానం దిశగా..**

భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లోని కంటైనర్ రైళ్ల ఆపరేటర్ల కోసం సరళమైన, ఏకరూప లైసెన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడమే ఆమోదిత సవరణల ప్రధాన లక్ష్యం.

మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్ కింద కంటైనర్ రైళ్ల నిర్వహణకు ఒకే రకమైన నియంత్రణ విధానాన్ని అందించడంతోపాటు.. క్రమబద్ధమైన ఆమోద ప్రక్రియకు ఈ సంస్కరణలు దోహదపడతాయని భావిస్తున్నారు.

# భద్రాచలం-వాజేడు రహదారికి మోక్షం కల్పించండి

## -వారం రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలి: మంత్రి తుమ్మల



ఖమ్మం, ఆగష్టు 7: భద్రాచలం నుంచి వాజేడు వరకు అధ్వాన్నంగా మారిన రహదారికి తక్షణమే మోక్షం కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు.

బుధవారం ఈ మార్గంలో ప్రయాణించిన సందర్భంగా రహదారి దుస్థితిని చూసిన స్థానికులు మంత్రిని అడ్డుకుని తమ సమస్యలను వివరించారు. గతంలో మీరు ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు ఈ రహదారి నిర్మాణం జరిగిందని, అనంతరం ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 100 కిలోమీటర్ల ప్రయాణానికే మూడు గంటల సమయం పడుతోందని, ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, సంబంధిత అధికారులకు, తెలంగాణ ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రహదారి మరమ్మతులు, అభివృద్ధి పనులను అత్యవసరంగా ప్రారంభించి ప్రజల కష్టాలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రహదారి అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం ఆందోళనకరమని మంత్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి, కొత్త టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై మంత్రి జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రాచలం-వాజేడు రహదారి అభివృద్ధి పనులు మొత్తం మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. భద్రాచలం నుంచి ఏటపాక వరకు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 7.8 కిలోమీటర్ల రహదారిని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

ఏటపాక నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట వరకు 56.8 కిలోమీటర్ల మేర భద్రాద్రి డివిజన్ పరిధిలో రూ.67.58 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

సుబ్బంపేట నుంచి వాజేడు వరకు ములుగు డివిజన్ పరిధిలోని 48 కిలోమీటర్ల రహదారిని రూ.44 కోట్లతో నిర్మించనున్నారు.

మొత్తం 112.6 కిలోమీటర్ల పొడవున సుమారు రూ.115.28 కోట్ల వ్యయంతో ఈ రహదారి అభివృద్ధి కానుంది.

ఈ పనులను ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ చీఫ్ ఇంజినీర్ బీవీ రావు పర్యవేక్షించనుండగా, భద్రాచలం, ములుగు ఈఈలు క్షేత్రస్థాయిలో అమలును పర్యవేక్షించనున్నారు.

ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు రహదారి దుస్థితి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు.

# గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఐదుగురు అరెస్ట్

గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఐదుగురు అరెస్ట్



నల్గొండ, ఆగష్టు 7: ఒడిశా నుంచి నల్గొండ జిల్లాకు గంజాయి తరలిస్తున్న ఐదుగురు యువకులను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 2.240 కిలోల ఎండు గంజాయి, ఒక మారుతీ సుజుకీ బాలెనో కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ తెలిపారు.

సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం మరిపెడ ఎస్ఐ గండ్రాతి సతీష్, పోలీసు సిబ్బంది ఇస్లావత్ రవీందర్, రమేష్, వెంకన్న, మహిళా కానిస్టేబుల్ శాంతతో కలిసి పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ సమయంలో వేగంగా వచ్చిన ఒక మారుతీ సుజుకీ బాలెనో కారును పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు కారును నిలిపివేసి తనిఖీ చేయగా డ్రైవర్ సీటు కింద ఎండు గంజాయి ప్యాకెట్ లభించింది.

స్వాధీనం చేసుకున్న గంజాయి బరువు 2 కిలోల 240 గ్రాములుగా తేలింది. అరెస్టయిన వారు ××గండికోట వంశీ (24), చిత్రం రాకేష్ (22), చింతల తిరుమలేష్ (24), కంచి మహేష్ (25), మాదాసు మహేష్ (26)గా గుర్తించారు. వీరంతా నల్గొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన కనగల్ గ్రామ వాసులని పోలీసులు తెలిపారు.

నిందితులు త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో నల్గొండలో సెల్ఫ్ డ్రైవ్‌కు కారును అద్దెకు తీసుకుని ఒడిశాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి, నల్గొండలో విక్రయించేందుకు తరలిస్తుండగా మరిపెడలో పట్టుబడ్డారని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ ఎల్. పవన్ కుమార్ మాట్లాడుతూ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా రవాణా గురించి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు తగిన పారితోషికం కూడా అందజేస్తామని తెలిపారు.

# స్వచ్ఛ శుక్రవారంతో పరిశుభ్రతపై చైతన్యం

నల్గొండ, ఆగష్టు 7: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం 'స్వచ్ఛ శుక్రవారం' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కానులపల్లి గ్రామంలో సర్పంచ్ గద్దల రాజశేఖర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని, ఇంటి ఆవరణతో పాటు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హైమద్ పాషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జులై 15 నాటికి నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్య 17.68 లక్షలు

న్యూఢిల్లీ, ఆగష్టు 7:ఉద్యోగార్థులకు, సంస్థలకు ఉపాధి సంబంధిత సేవలను సులభతరం చేసేందుకు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ జాతీయ ఉపాధి సేవను అమలు చేస్తోంది. ఇందులో ఉద్యోగార్థుల నమోదు, సంస్థల నుంచి ఖాళీల వివరాల సేకరణ, వృత్తిపరమైన, కౌన్సిలింగ్‌పరమైన మార్గదర్శకం మొదలైన సేవలు అందుబాటులో ఉంటాయి. జాతీయ ఉపాధి సేవ పేరును నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్)గా మార్చారు. కెరీర్ సంబంధిత సేవలు అన్నింటినీ ఒక్కచోటే అందించే డిజిటల్ వేదికగా ఎన్‌సీఎస్ పోర్టల్ పనిచేస్తుంది. దీనిలో ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు, ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ జాబ్ ఫెయిర్‌ల సమాచారం, ఉద్యోగాన్వేషణ, అర్హతలకు తగిన ఉద్యోగాన్ని సూచించడం, కెరీర్ కౌన్సెలింగ్, వృత్తిపరమైన సూచనలు, నైపుణ్యాభివృద్ధి కోర్సులకు సంబంధించిన సమాచారం, నైపుణ్య/శిక్షణ కార్యక్రమాలు తదితరమైన సేవలు అందుబాటులో ఉంటాయి.

ఎన్‌సీఎస్ పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 6.64 కోట్లకు పైగా ఉద్యోగార్థులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. వారిలో 15.07.2026 నాటికి 2.89 కోట్ల మంది క్రియాశీలకంగా ఉన్నారు. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 10.05 కోట్లకు పైగా ఖాళీల వివరాలు పోర్టల్లో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో15.07.2026 నాటికి 17.68 లక్షల ఖాళీలు అందుబాటులో ఉన్నాయి.

పోర్టల్‌ను మెరుగుపరచడం నిరంతరం కొనసాగే ప్రక్రియ. అవసరాన్ని బట్టి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తగిన మార్పులూచేర్పులూ చేస్తారు. క్లౌడ్‌ఆధారిత, ఓపెన్‌ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్‌కు ఎన్‌సీఎస్‌ను మెరుగుపరిచారు. దీనిని నిరంతరం అభివృద్ధి చేస్తూనే ఉంటారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా, అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీలను ఉపయోగించి మెరుగుపరుస్తారు. నవీకరిస్తారు. దీనిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ, నైపుణ్య వెబ్‌సైట్లను అనుసంధానించడం, ఏఐ-ఆధారిత ఫీచర్లను మెరుగుపరచడం (ఇంటిలిజెంట్ జాబ్ మ్యాచింగ్, ఏఐ స్కిల్ గ్యాప్ విశ్లేషణ, వ్యక్తిగతీకరించిన ఉద్యోగ సూచనలు, ఏఐ ఇంటర్వ్యూ కోచ్, భాషిణి ద్వారా బహుళ భాషల్లో తోడ్పాటును అందించడంతో సహా), ఉద్యోగార్థులు, సంస్థల కోసం క్లౌడ్ ఆధారిత అప్లికేషన్లు, పటిష్టమైన ధ్రువీకరణ వ్యవస్థలు, సౌలభ్యాన్ని, వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరిచేందుకు మొబైల్ అప్లికేషన్ల ప్రారంభం తదితరమైనవి ఉన్నాయి.

ప్రతి ఆర్థిక సంఘం పదవీ కాలం ప్రారంభానికి ముందు అన్ని పథకాలు, కార్యక్రమాలు ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా, సమర్థవంతంగా, మారుతున్న ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో చూసేందుకు క్రమబద్ధమైన సమీక్షను, మూల్యాంకనాన్ని ప్రభుత్వం చేపడుతుంది.

అలాగే, ఉద్యోగార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలను అందించడం కోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు ప్రైవేటు, ప్రభుత్వ రంగాలకు చెందిన సంస్థలు/పోర్టళ్లు/వేదికలతో మంత్రిత్వ శాఖ అనేక అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇప్పటి వరకు 40కి పైగా అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వాటిలో ఏపీఎన్ఏ, స్విగ్గీ, ర్యాపిడో, జొమాటో, అమెజాన్, టీసీఎస్ అయాన్, క్వికర్, ఫౌండ్‌ఇట్ (మాన్‌స్టర్) తదితర ప్రైవేటు సంస్థలతో కుదిరిన ఒప్పందాలు కూడా ఉన్నాయి. ఈ భాగస్వామ్యాల ద్వారా జాబ్ ఫెయిర్ వివరాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ కౌన్సిలింగ్ వంటి సేవలను ఎన్‌సీఎస్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉంటాయి. ఉద్యమ్, ఈ-శ్రామ్, స్కిల్ ఇండియా డిజిటల్ హబ్, ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ, ఎంహెచ్ఆర్‌డీ, డిజీలాకర్, తదితర ప్రభుత్వ పోర్టళ్లు సైతం ఎన్‌సీఎస్ వెబ్‌సైటుకి అనుసంధానం చేశారు. అలాగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్మెంట్ బోర్డు, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు తదితర ప్రభుత్వ నియామక సంస్థలతో కూడా అనుసంధానమై ఉంది.

# రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృంద సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృందం రెండో సమావేశం, ఆస్తుల పునరుద్ధరణపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాలు కేంద్ర సిబ్బంది, శిక్షణ (డీవోపీటీ) శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలోని హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిశాయి. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న ఈ సమయంలో.. 2026 ఆగస్టు 4, 5 తేదీల్లో ఈ సమావేశాలను నిర్వహించారు.

భారత్ అధ్యక్షతన నిర్వహిస్తున్న బ్రిక్స్ సమావేశాల ఇతివృత్తమైన.. 'పటిష్టత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతల కోసం నిర్మాణం' లక్ష్యానికి అనుగుణంగా ఈ సమావేశాలను నిర్వహించారు. అన్ని బ్రిక్స్ సభ్య దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉన్నతస్థాయి విధాన రూపకర్తలు, నిపుణులు, కార్యకర్తలతోపాటు.. అవినీతి నిరోధక, ఆర్థిక నిఘా, చట్టాల అమలు సంస్థల ప్రతినిధులు హాజరై వివిధ అవినీతి నిరోధక అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి శ్రీమతి రచనా షా ఈ సమావేశాన్ని ప్రారంభించి ప్రతినిధులకు స్వాగతం పలికారు. అవినీతిని ఎంతమాత్రం సహించని భారత విధానాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, ప్రజా విశ్వాసాలకు.. నైతికత, సమగ్రతలే అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. బలమైన సంస్థలు, సాంకేతికత ప్రాతిపదికగా పాలన, పారదర్శకత, జవాబుదారీతనం, నిరంతర అంతర్జాతీయ సహకార ఆవశ్యకతను ప్రముఖంగా ప్రస్తావించారు.

బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృందం సాధారణ అవగాహనను పెంచుకునే వేదికగానే కాకుండా.. ఆచరణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టే దిశగా వేగంగా పరివర్తన చెందుతోందని కార్యదర్శి వ్యాఖ్యానించారు. ప్రభావవంతమైన అంతర్జాతీయ సహకారం సాధ్యపడాలంటే.. సకాలంలో సమాచార మార్పిడి, సంబంధిత అధికారిక సంస్థల మధ్య సత్వర సమన్వయం అవసరమని ఆమె పేర్కొన్నారు. అలాగే అధికారిక పరస్పర చట్టపరమైన సాయం, నేరగాళ్ల అప్పగింత విధానాలకు తోడుగా.. క్షేత్రస్థాయి నిపుణుల మధ్య నమ్మకమైన సమాచార వినిమయ వ్యవస్థలూ అత్యంత కీలకమైనవన్నారు.

అవినీతికి పాల్పడి దేశం దాటి పరారైన నేరగాళ్లను పట్టుకోవడంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకోవడం, నేరస్తుల అప్పగింత ప్రక్రియకు తోడ్పడడం లక్ష్యంగా.. బ్రిక్స్ దేశాల కోసం చట్టాలను అమలు చేసే నిపుణులతో అనుసంధానం కోసం అధ్యక్ష స్థానంలో భారత్ కీలక ప్రతిపాదన చేసింది. దానికి సభ్య దేశాల నుంచి విశేష మద్దతు లభించింది. ఈ ప్రతిపాదిత నెట్‌వర్క్ లక్ష్యాలు, పరిధి, కార్యాచరణ విధానాలపై సభ్య దేశాలు నిర్మాణాత్మకంగా చర్చించి, సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. క్షేత్రస్థాయి నిపుణుల కోసం ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసేందుకు చర్చలను కొనసాగించాలని నిర్ణయించాయి. ఈ కార్యక్రమంతో అనధికారిక సహకారం పెరగడంతోపాటు.. పరారీలో ఉన్న నేరగాళ్లను గుర్తించడం సులభతరమవుతుందని, అధికారికంగా నేరస్తుల అప్పగింత కోసం ప్రస్తుతమున్న యంత్రాంగానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు.

అవినీతికి పాల్పడి పరారైన నేరగాళ్లను గుర్తించడానికి, వారి అప్పగింతకు తోడ్పడటానికి ఉద్దేశించిన అనధికారిక సహకారంపై బ్రిక్స్ సమాచార నిధి (రిపాజిటరీ)ని కూడా సభ్య దేశాలు స్వాగతించాయి. వివిధ దేశాల అమలు విధానాలు, అందుబాటులో ఉన్న అనధికారిక సహకార మార్గాల సమాచారాన్ని ఒకే చోటికి చేర్చే ఒక ఆచరణాత్మక, నిపుణుల ప్రాతిపదికన నడిచే ఆధారంగా ఇది ఉపయోగపడుతుంది.

ఆస్తుల పునరుద్ధరణపై ఏర్పాటైన బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశం.. సంబంధిత అధికారిక సంస్థల మధ్య ప్రత్యక్ష సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కూడిన ఆచరణాత్మక అంశాలలో గణనీయమైన పురోగతిని సాధించింది. అధికారిక పరస్పర చట్టపరమైన సహాయ విధానాలకు తోడ్పడుతూనే.. దర్యాప్తు ప్రాథమిక దశల్లో క్షేత్రస్థాయి నిపుణుల మధ్య సకాలంలో సమాచార మార్పిడిని సులభతరం చేసేందుకు ఉద్దేశించిన ప్రమాణీకృత విధానాలపై సభ్య దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.

బ్రిక్స్ దేశాల్లోని అధికారిక సంస్థల మధ్య మరింత ప్రత్యక్ష సమాచార మార్పిడికి తోడ్పడే ప్రధాన అంశాలు, నిపుణుల డైరెక్టరీని కూడా నిపుణుల నెట్‌వర్క్ స్వాగతించింది. ఈ జాబితా ఎప్పటికప్పుడు కచ్చితంగా, కార్యాచరణోపయోగంగా ఉండేందుకు వీలుగా.. అదనంగా నిపుణులను నామినేట్ చేయడంతోపాటు, భవిష్యత్ బ్రిక్స్ అధ్యక్ష దేశాలు ఈ డైరెక్టరీని క్రమానుగతంగా సమీక్షించి నవీకరించేందుకు సభ్య దేశాలు మద్దతు తెలిపాయి.


KAVISANGAMAM
the Poetry Space

సీజన్: 2
సీరీస్: 46

8 ఆగస్టు 2026
రెండవ శనివారం
సా. 6 గంటలకు

రెండుతరాల కవిసంగమం
పాల్గొంటున్న కవులు

సౌజన్యవేదిక:
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం
సుల్తాన్ బజార్(రాంకోఠి)
కోఠి, హైదరాబాద్



ప్రొ.బెల్లి యాదయ్య
రోహిణి వంజారి
జాబేర్ పాషా
ప్రమోద్ వడ్లకొండ
ఎస్.ఎస్.తరుణ్

# పెద్ది అన్న జ్ఞాపకాలతో కన్నీటి సంద్రమైన ఇటుకాలపల్లి

మహబూబ్‌నగర్, ఆగష్టు 7: “పెద్ది అన్న మా ఇంటి మనిషి? మా కుటుంబ సభ్యుడు? ఆయన లేరనే విషయాన్ని ఇప్పటికీ మనసు ఒప్పుకోవడం లేదు?” అంటూ ఇటుకాలపల్లి గ్రామ ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామంలో దివంగత మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామమంతా ఒక్కటై ఆయనకు అపూర్వ నివాళులు అర్పించింది.

గురువారం రాత్రి గ్రామంలో చిన్నా, పెద్దా, మహిళలు, యువకులు, రైతులు, కూలీలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు కాదు, కుటుంబాలే తరలిరావడం గ్రామ ప్రజల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ఉన్న అపారమైన ప్రేమాభిమానాలకు నిదర్శనంగా నిలిచింది.

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదినాలు ఒకే రోజు కావడంతో ఈ ఇద్దరు మహనీయులను స్మరించుకుంటూ గ్రామమంతా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. “పెద్ది అన్న అమర్ హై”, “జయశంకర్ సార్ ఆశయాలు చిరంజీవి” అంటూ నినాదాలతో గ్రామ వీధులు మార్మోగాయి. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు కన్నీటి పర్యంతమై మాట్లాడుతూ, “కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా గుర్తొచ్చేది పెద్ది అన్నే. ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించి, అనేక మంది యువకులకు చేయూతనిచ్చి, పేదలకు అండగా నిలిచిన మహానుభావుడు. ఆయన చేసిన మేలు ఈ జన్మలో మరువలేం” అంటూ భావోద్వేగంతో నివాళులర్పించారు.

మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, “ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించిన నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి. ఆయన లాంటి నాయకుడు మళ్లీ రావడం కష్టం” అని పేర్కొన్నారు.

గ్రామ పెద్దలు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజకీయ నాయకుడిగా కాకుండా ప్రతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా, ప్రతి మనిషి గుండెల్లో స్థానం సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన చూపిన సేవా మార్గం, ప్రజల పట్ల చూపిన ప్రేమాభిమానాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం గ్రామ ప్రజలు, బంధు మిత్రుల ందరికీ విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన కట్ల సుధాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, ప్రధాన బాధ్యతలు స్వీకరించి విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండల రవి, మాజీ సర్పంచ్ సున్నం కొమ్మలు, మాజీ ఎంపీటీసీ భూక్య వీరన్న, మాజీ ఉపసర్పంచ్ జమాండ్ల చంద్రమౌళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఈర్ల నరసింహ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు బొడిగె వినయ్ గౌడ్, మండల రాజమౌళి, పిట్టల శ్రీనివాస్, తాళ్లపల్లి అశోక్ గౌడ్, బుర్ర ఆనంద్, దేసినీ పద్మతో పాటు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# చట్టవిరుద్ధ.. అశ్లీల కంటెంట్ నుంచి భారత ఇంటర్నెట్ విముక్తి..

## సురక్షిత-విశ్వసనీయ డిజిటల్ వాతావరణ సృష్టి ప్రభుత్వ లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 7: దేశంలోని మహిళలు-బాలలు సహా వినియోగదారులకు ఒక సార్వత్రిక, సురక్షిత, విశ్వసనీయ, జవాబుదారీతనం సహిత ఇంటర్నెట్ సౌలభ్య కల్పనే ప్రభుత్వ విధానాల లక్ష్యం. ఆ మేరకు ఏ రూపంలోనైనా చట్టవిరుద్ధ కంటెంట్ లేదా సమాచారం నుంచి... ముఖ్యంగా అనభ్య-అశ్లీల కంటెంట్ నుంచి విముక్తి కల్పించడంపై ప్రభుత్వం నిబద్ధతతో ఉంది.

డిజిటల్ ప్రపంచంలో చట్టవిరుద్ధ, హానికర కంటెంట్ నిరోధం దిశగా సమాచార సాంకేతిక చట్టం-2000 (ఐటీ చట్టం), సమాచార సాంకేతిక (మధ్యంతర మార్గదర్శకాలు-డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నిబంధనలు-2021 (ఐటీ నిబంధనలు) సంయుక్తంగా ఒక సమగ్ర చట్రాన్ని రూపొందించాయి. అంతేకాకుండా జవాబుదారీతనం భరోసా ఇస్తూ మధ్యంతర వ్యవస్థకు స్పష్టమైన బాధ్యతలను నిర్దేశిస్తాయి.

ఐటీ నిబంధనలు-2021, సామాజిక మీడియా మధ్యంతర వ్యవస్థలు తగిన శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి. ఈ మేరకు అశ్లీల, పోర్నోగ్రాఫిక్, పెడోఫిలిక్, పిల్లలకు హానికరమైన, గోప్యతను ఉల్లంఘించే, లింగం ఆధారంగా అవమానించే లేదా వేధించే లేదా అమలులోగల ఏదైనా చట్టాన్ని ఉల్లంఘించే సమాచార ప్రసారం-ప్రదర్శన, అప్‌లోడ్, సవరణ, ప్రచురణ, నిల్వ-అప్‌డేట్ లేదా పంచుకోవడం తదితరాల కోసం ఆ వ్యవస్థల కంప్యూటర్ వనరులను వినియోగదారులు వాడటం లేదని భరోసా ఇచ్చేవిధంగా సహేతుక కృషి చేయాలి. ఐటీ నిబంధనలు-2021లో నిర్దేశించిన చట్టపరమైన బాధ్యతలను మధ్యంతర వ్యవస్థలు పాటించని పక్షంలో ఐటీ చట్టంలోని సెక్షన్ 79 కింద తృతీయ పక్ష సమాచారం నుంచి లభించే మినహాయింపును అవి కోల్పోతాయి. అమలులోగల ఏదైనా చట్టం ప్రకారం తదుపరి చర్యలకు లేదా ప్రాసిక్యూషన్‌కు వారు బాధ్యులవుతారు.

డీప్‌ఫేక్, ఏఐ ఆధారిత కంటెంట్ సహా కృత్రిమ సమాచారం (ఎస్‌జీఐ) వల్ల కలిగే కష్టనష్టాల పరిష్కారానికి 2026 ఫిబ్రవరి 10న ప్రభుత్వం ఐటీ నిబంధనలను సవరించి నియంత్రణ చట్రాన్ని బలోపేతం చేసింది.

ఈ సవరణల ప్రకారం అశ్లీల, తప్పుదోవ పట్టించే, వ్యక్తులను అనుకరించే లేదా బాలలకు హానికర కంటెంట్ సహా చట్టవిరుద్ధ, ఏఐ ఆధారిత కంటెంట్ సృష్టి-వ్యాప్తి నిరోధం కోసం మధ్యంతర వ్యవస్థలు, పెద్ద సామాజిక మాధ్యమ వేదికలు సహేతుక సాంకేతిక చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత-2023 లేదా లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం-2012 వంటి చట్టాల ప్రకారం, సంబంధిత నేరాలపై సముచిత అధికార యంత్రాంగానికి నివేదించాల్సిన బాధ్యత కూడా ఆ వేదికలపై ఉంటుంది.

అన్ని రకాల సైబర్ నేర సంఘటనలపై ప్రజల నివేదనకు వీలుగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)లో భాగంగా ‘నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్’ ప్రారంభమైంది. మహిళలు-బాలలపై కొన్ని రకాల సైబర్ నేరాలపై అజ్ఞాత ఫిర్యాదుకు ఈ పోర్టల్ నిబంధనలు వీలు కల్పిస్తాయి. ఈ మేరకు “మహిళలు/బాలల సంబంధిత నేరాలను నివేదించండి” మాడ్యూల్ కింద ఫిర్యాదుదారులు “అజ్ఞాతకంగా నివేదించండి” అనేదాన్ని ఎంచుకోవచ్చు. తద్వారా వ్యక్తిగత గుర్తింపు వివరాల వెల్లడితో నిమిత్తం లేకుండా ఫిర్యాదు సమర్పణకు అనుమతిస్తుంది.

అనుమానాస్పద వెబ్‌సైట్ ‘యూఆర్ఎల్’లు, వాట్సాప్ నంబర్లు, టెలిగ్రామ్ హ్యాండిళ్లు, ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు, ఎస్ఎంఎస్ హెడర్లు-నంబర్లు, డీప్ ఫేక్‌లు, సోషల్ మీడియా ‘యూఆర్ఎల్’ల గురించి పౌరుల నివేదనకు వీలుగా ‘ఎన్‌సీఆర్‌పీ’లోని ‘రిపోర్ట్ అండ్ చెక్ సస్పెక్ట్’ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారు.

‘మహిళలు-బాలలపై సైబర్ నేరాల నివారణ (సీసీపీడబ్ల్యూసీ)’ పథకం కింద సైబర్ ఫోరెన్సిక్-కమ్-శిక్షణ ప్రయోగశాలల ఏర్పాటు, జూనియర్ సైబర్ కన్సల్టెంట్ల నియామకం, దర్యాప్తు సంస్థల సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారులకు శిక్షణ వంటి సామర్థ్య వికాస కార్యకలాపాల కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రభుత్వం రూ.132.93 కోట్ల ఆర్థిక సహాయాన్ని విడుదల చేసింది. తదనుగుణంగా 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సైబర్ ఫోరెన్సిక్-కమ్-శిక్షణ ప్రయోగశాలలు ప్రారంభమయ్యాయి. వీటిలో 24,600 మందికి పైగా దర్యాప్తు సంస్థల సిబ్బంది, న్యాయాధికారులు, ప్రాసిక్యూటర్లకు సైబర్ నేరాలపై అవగాహన, దర్యాప్తు, ఫోరెన్సిక్స్ తదితర అంశాల్లో శిక్షణనిచ్చారు.

దేశవ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకేఎస్ విద్యార్థులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) సైబర్ హైజీన్ శిక్షణనిచ్చింది.

అలాగే, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన లక్ష్యంగా ‘హ్యాండ్‌బుక్ ఫర్ అడోలెసెంట్స్-స్టూడెంట్స్’ను, మహిళల్లో చైతన్యం పెంచే దిశగా ‘సైబర్ సెక్యూరిటీ హ్యాండ్‌బుక్ ఫర్ మహిళా సురక్ష’ను ‘ఐ4సీ’ ఆవిష్కరించింది.

సమాచార భద్రత రంగంలో మానవ వనరుల సృష్టి, ప్రజలలో సైబర్ హైజీన్ అండ్ సైబర్ సెక్యూరిటీ సంబంధిత వివిధ అంశాలపై సార్వత్రిక అవగాహన దిశగా ప్రభుత్వం ‘ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్’ (ఐఎస్ఈఏ) ప్రాజెక్టును కూడా అమలు చేస్తోంది.

కేంద్ర సమాచార-ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఇవాళ లోక్‌సభలో శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారం వెల్లడించారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

**కృత్తిక పర్వదినాన “శరవణభవ” నామస్మరణతో మారుమోగిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు**



హైదరాబాద్, ఆగష్టు 7: ఆషాఢ మాసంలోని పవిత్ర ఆడి కృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మేకవానిపాలెం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో ఆడి కృత్తిక కావడి సేవా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ ప్రాంగణం అంతా భక్తులు “శరవణభవ” నామస్మరణతో మారుమోగింది. కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆయురారోగ్యాలు, సంతాన సౌభాగ్యం, సర్వమంగళాలు కలగాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆషాఢ మాసంలో కృత్తిక నక్షత్రం వచ్చే రోజును ఆడి కృత్తికగా భావిస్తారు. ఈ రోజు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటాయి. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్ష ఆచరించి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్తోత్రాలు, జన్మవృత్తాంతాన్ని పారాయణం చేసి, సాయంత్రం కృత్తిక నక్షత్ర దర్శనం చేసుకోవడం విశేషం. ఈ విధంగా భక్తిశ్రద్ధలతో ఆడి కృత్తిక వ్రతాన్ని ఆచరించి స్వామివారిని సేవిస్తే దోషాలు తొలగి, దైవానుగ్రహం లభించి, మనసులో కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

## గత ఏడాదిగా ప్రభుత్వ ప్రసార సంస్థల సంపాదకీయ స్వయంప్రతిపత్తి, పనితీరుపై నమోదుకాని ఫిర్యాదులు

న్యూఢిల్లీ, ఆగష్టు 7:దేశంలో ప్రసార భారతికి చెందిన ప్రసార మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్ కోసం బ్రాడ్‌కాస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ (బీఐఎన్‌డీ) అనే కేంద్ర రంగ పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొదట 2021-26 కాలానికి రూపొందించిన ఈ పథకాన్ని మార్చి 31, 2027 వరకు పొడిగించారు. ఈ పథకానికి కేటాయించిన బడ్జెట్ నిధులు, వాస్తవ వ్యయం, ఆదాయానికి సంబంధించిన వివరాలన్నీ ప్రసార భారతి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

సంపాదకీయ వ్యవహారాలను ప్రధాన సంపాదకుడు, సీనియర్ సంపాదకీయ బృందాలు క్రమం తప్పకుండా సమీక్షిస్తుంటాయి. ప్రసార భారతి సంపాదకీయ విధానాలు, ప్రసార నిబంధనలకు అనుగుణంగా వార్తల నాణ్యత, ఖచ్చితత్వం, నిష్పాక్షికత, ప్రదర్శనను పెంచడానికి అవసరమైన మార్గదర్శకాలను, దిద్దుబాటు చర్యలను తీసుకుంటారు. సంపాదకీయ కంటెంట్‌కు సంబంధించి వీక్షకుల నుంచి వచ్చే ఫిర్యాదులు లేదా అభిప్రాయాలను నిర్ణీత విధానం ప్రకారం తదుపరి చర్యల కోసం సంబంధిత సంపాదకీయ బృందానికి పంపుతారు.

గత ఏడాది కాలంలో ప్రభుత్వ ప్రసార సంస్థల స్వయంప్రతిపత్తి, నియామకాలు లేదా సంపాదకీయ పనితీరుకు సంబంధించి విలేకరులు, ఉద్యోగులు లేదా మీడియా సంస్థల నుంచి ఎలాంటి ఫిర్యాదులు గానీ, అధికారిక వినతిపత్రాలు గానీ రాలేదు. అయితే నియామకాలకు సంబంధించి దరఖాస్తుదారుల నుంచి 07 ఫిర్యాదులు వచ్చాయి.

దేశంలో ఆకాశవాణి దాదాపు 98 శాతం జనాభాకు, 90 శాతం భౌగోళిక ప్రాంతానికి తన ప్రసార సేవలను అందిస్తోంది. ఇక డీడీ ఫ్రీ డిష్ సేవలు ఎలాంటి నెలవారీ చందా రుసుములు లేకుండా దేశంలో ఎక్కడైనా ఉచితంగా వీక్షించేందుకు అందుబాటులో ఉన్నాయి. ప్రసార భారతి తన సాధారణ సంపాదకీయ ప్రక్రియలో భాగంగా వీక్షకుల డేటా, వారి అభిప్రాయాలు, సామాజిక మాధ్యమ విశ్లేషణలను నిరంతరం సమీక్షిస్తుంది. ఈ విశ్లేషణల ఆధారంగా తన వార్తల నాణ్యత, కంటెంట్, ప్రదర్శనా రీతిని నిరంతరం మెరుగుపరుస్తుంది.

ఈ వివరాలను నేడు లోక్‌సభలో ఎంపీలు అడ్వకేట్ ప్రియా సరోజ్, శ్రీ పుష్పేంద్ర సరోజ్ అడిన ప్రశ్నకు సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లిఖితపూర్వక సమాధానంగా వెల్లడించారు.

## పాకిస్తాన్ నుంచి ఉత్పత్తుల దిగుమతిని నిషేధించిన భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 7:పాకిస్తాన్ ఉత్పత్తుల దిగుమతులపై భారత్ నిషేధం విధించింది. ఇందుకు వ్యతిరేకంగా మూడో దేశం ద్వారా పాకిస్తాన్‌కు చెందిన వస్తువులను రహస్యంగా భారత్‌కు మళ్లించటం, తప్పుడు ప్రకటన చేయటాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) వెలుగులోకి తెచ్చింది. ఈ ఆపరేషన్ ఫలితంగా రూ. 3 కోట్ల విలువైన 364 ఎంటీల పాకిస్తాన్‌కు చెందిన ఎండు ఖర్జూరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నిఘా వర్గాల సమాచారంతో చేపట్టిన ఆపరేషన్‌లో కాండ్లా ఓడరేవుకు దిగుమతి అయిన సుమారు రూ. 3 కోట్ల విలువైన 364 ఎంటీల ఎండు ఖర్జూరాలతో ఉన్న 13 కంటైనర్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సరకు యూ ఏఈ నుంచి వచ్చినట్లు ప్రకటించినప్పటికీ, అది పాకిస్తాన్‌కు చెందినదని విచారణలో తేలింది.

ఈ కంటైనర్లను మొదట పాకిస్తాన్ నుంచి దుబాయ్‌కి తరలించి, ఆ తర్వాత భారతదేశానికి పంపటానికి ముందుగా వేరే కంటైనర్లకు మార్చినట్లు విచారణలో తేలింది. పాకిస్తాన్ వస్తువుల దిగుమతిపై ఉన్న నిషేధాన్ని తప్పించుకునే క్రమంలో దిగుమతిదారులు కీలకమైన వాస్తవాలను దాచిపెట్టి, సరకు ఏ దేశానికి చెందినదో తప్పుగా ప్రకటించినట్లు ఆరోపణలు న్నాయి. దీని ప్రకారం కస్టమ్స్ చట్టం-1962లోని సంబంధిత నిబంధనల ద్వారా మొత్తం సరకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

గతవారంలో టూటికోరిన్ ఓడరేవులో వస్తువుల వివరాలు, ఉత్పత్తి దేశాన్ని తప్పుగా పేర్కొంటూ... పాకిస్తాన్‌కు చెందిన సుమారు 14 ఎంటీల గుగ్గులు రెసిన్‌ను అక్రమంగా దిగుమతి చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని డీఆర్ఐ అధికారులు భగ్నం చేశారు. సుమారు రూ. 1.4 కోట్ల విలువైన ఈ సరకును సోమాలియాలో తయారైన సహజమైన రెసిన్‌గా, దుబాయ్ మీదుగా వచ్చినట్లు తప్పుడు ప్రకటన చేశారని అధికారులు గుర్తించారు.

# మాదిగ బోనాల పోస్టర్‌ను ఆవిష్కరించిన జగ్గారెడ్డి

## -శనివారం బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



సంగారెడ్డి, ఆగష్టు 7: (నేటినిజం ప్రతినిధి):సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగా మాదిగ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాల పోస్టర్‌ను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు టి. జగ్గారెడ్డి గురువారం రాత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, శనివారం నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు శ్రీ అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీని ఆహ్వానించినట్లు తెలిపారు. ఆయన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

శనివారం ఐబీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే బోనాల ఊరేగింపు హస్తబల్ ఎల్లమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఈ ఉత్సవాల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్వకేట్లు, పోలీసులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు వెల్లడించారు.

మాదిగ బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# రెండవ రోజు దగా డీఎస్సీపై ప్రజా పోరాటం ప్రారంభం..

హైదరాబాద్, ఆగష్టు 7: డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, రైతులకు సాగునీరు అందించాలని, పామర్రులో అర్హులైనవారికి ఇస్తానన్న మూడు సెంట్ల ఇళ్ళ స్థలాలు వెంటనే ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలుచెయ్యాలని పామర్రు టౌన్ కార్యాలయం ఎదుట శుక్రవారం రెండవ రోజు రిలే నిరాహార దీక్ష ప్రారంభమైంది.

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పామర్రు నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం లో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

ఈ రిలే నిరాహార దీక్షలు ఆగస్టు 8 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి. నిజాయితీగా చదివిన నిరుద్యోగులకు, విద్యార్థులకు, రైతులకు, మహిళలకు, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు.

# వ్యాధి వ్యాప్తి నిరోధక జాతీయ సంయుక్త బృందాన్ని రంగంలోకి దింపిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగష్టు 7:గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో తీవ్రంగా వ్యాపిస్తున్న చండీపురా వైరస్ వ్యాధిని అరికట్టే చర్యలను మరింత వేగవంతం చేయడం లక్ష్యంగా వ్యాధి వ్యాప్తి నిరోధక జాతీయ సంయుక్త బృందాన్ని (ఎన్‌జేఓఆర్టీ) కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ రంగంలోకి దింపింది. రాష్ట్ర నిఘా విభాగాలతో కలిసి, జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిర్వహించే సమీకృత వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమం (ఐడీఎస్పీ) కింద వ్యాధులపై నిరంతర పర్యవేక్షణతోపాటు... దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధన సంస్థలు నిరంతర శాస్త్రీయ దర్యాప్తును తీవ్రతరం చేసిన నేపథ్యంలో ఈ బృందాలను పంపించారు. వైరస్ సంక్రమణ విధానం, లక్షణాలు, తీవ్రత, సాధ్యమయ్యే చికిత్స పద్ధతులపై మరింత స్పష్టతను సాధించడంతోపాటు.. శాస్త్రీయ పద్ధతుల్లో స్పష్టమైన రుజువుల ప్రాతిపదికన ప్రజారోగ్య చర్యలను చేపట్టడం ఈ సమన్వయ ప్రయత్నాల లక్ష్యం. అంతేకాకుండా ఎన్‌జేఓఆర్టీకి మద్దతుగా.. ఎన్‌సీడీసీ ప్రజారోగ్య అత్యవసర కార్యకలాపాల కేంద్రం (పీహెచ్ఈఓసీ) కూడా పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు.

జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ), భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ (డీఏహెచ్‌డీ)లలోని వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఎన్‌జేఓఆర్టీ బృందంలో ఉంటారు. వ్యాధి వ్యాప్తిపై దర్యాప్తు, విపత్తు అంచనా, చికిత్సాపరమైన నిర్వహణ, ప్రయోగ సమన్వయం, వ్యాధి వాహకాల పరిశీలన, ప్రజారోగ్య చర్యల అమలులో రెండు రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు ఈ బృందం తోడ్పాటునందిస్తుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖలతో కలిసి పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం.. మంత్రిత్వశాఖకు సిఫార్సులను అందిస్తుంది.

ఇటీవలి కాలంలో చండీపురా వైరస్‌పై చేపట్టిన అత్యంత సమగ్రమైన శాస్త్రీయ దర్యాప్తుల్లో భాగంగా ఈ బృందాలు రంగంలోకి దిగాయి. చెన్నైలోని ఐసీఎంఆర్ - జాతీయ అంటువ్యాధుల అధ్యయన సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐఈ), పుదుచ్చేరిలోని ఐసీఎంఆర్- జాతీయ వ్యాధి వాహక నియంత్రణ పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్- ఎన్ఐవీసీఆర్), పూణెలోని ఐసీఎం ఆర్- జాతీయ జాతీయ వైరాలజీ సంస్థ (ఐసీఎంఆర్- ఎన్ఐవీ), హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- జాతీయ చికిత్స పూర్వ పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్- ఎన్ఐపీసీఆర్), బెంగళూరులోని ఐసీఏఆర్- జాతీయ పశువైద్య అంటువ్యాధుల అధ్యయన, వ్యాధి సమాచార సంస్థ (ఐసీఏఆర్- ఎన్ఐవీఈడీఐ)లకు చెందిన నిపుణులు.. గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య శాఖతో కలిసి వ్యాధి వ్యాప్తిపై అత్యంత సమన్వయంతో పరిశోధనలు సాగిస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి విజ్ఞాన, వైరాలజీ, కీటక శాస్త్ర, పశు వైద్య శాస్త్ర, ప్రయోగశాల నిర్ధారణ పరీక్ష విభాగాల నిపుణులు ఈ ఉమ్మడి పరిశోధనల్లో కలిసి పనిచేస్తున్నారు. తేలికపాటి జ్వరంతో కూడిన అనారోగ్యం నుంచి తీవ్రమైన మెదడువాపు వ్యాధి లక్షణాల వరకు.. చండీపుర వైరస్ సంక్రమణకు సంబంధించి పూర్తి వైద్యపరమైన లక్షణాల పరిధిని అర్థం చేసుకోవడం, ప్రజారోగ్య చర్యలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన శాస్త్రీయ ఆధారాలను సేకరించడం ఈ భాగస్వామ్య ప్రక్రియ ప్రధాన లక్ష్యం. ఈ పరిశోధనలో భాగంగా వ్యాధి ప్రభావిత జిల్లాల్లో జ్వరంతో కూడిన అనారోగ్యం నుంచి తీవ్రమైన మెదడువాపు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులపై క్రియాశీల పర్యవేక్షణను మరింత పెంచారు. అదే సమయంలో లక్షణాలు కనిపించని వ్యాధిగ్రస్తులను గుర్తించి, వైరస్ వ్యాప్తి ఏ మేరకు ఉందో కచ్చితం గా అంచనా వేయడానికి క్షేత్రస్థాయిలో సెరోసర్వేలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వ్యాధి పెరిగే విధానాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి వీలుగా.. నిర్ధారణ పరీక్షలను బలోపేతం చేయడంతోపాటు మెరుగైన జంతు నమూనాల అభివృద్ధిలో ప్రయోగశాల బృందాలు ఏకకాలంలో పనిచేస్తున్నాయి.

వైరస్ సంక్రమణ వలయాన్ని ఛేదించడమే ఇందులో ముఖ్యమైన అంశం. చండీపురా వైరస్ వ్యాప్తిలో ఇసుక ప్రాంతాల్లోని ఈగలను (సాండ్‌ఫ్లైస్) ప్రధాన వాహకాలుగా గుర్తించారు. అయితే దోమలు, నల్లులు, పురుగుల వంటి ఇతర కీటకాలు కూడా ఇందుకు కారణమవుతున్నాయా అనే కోణంలో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల నుంచి సేకరించిన భారీ సంఖ్యలోని కీటక నమూనాలు ప్రస్తుతం ప్రయోగశాలల్లో విశ్లేషణ దశలో ఉన్నాయి. అయితే శాస్త్రీయ దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రస్తుత వ్యాప్తికి ఒక నిర్దిష్ట కీటకం కారణమని చెప్పడం తొందరపాటు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

వైరస్ వ్యాప్తికి ప్రాథమిక వనరులుగా పనిచేసే అవకాశం ఉన్నందున.. పెంపుడు జంతువుల్లో కూడా ఈ వైరస్ వ్యాపిస్తోందో లేదో తెలుసుకోవడానికి జంతువులపై పర్యవేక్షణను విస్తరించారు. ఇందులో భాగంగా ఆవులు, గేదెలు, మేకల నుంచి రక్తం, పాల నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. ఇప్పటివరకు దాదాపు 70 జంతువుల రక్త నమూనాలను సేకరించి విశ్లేషిస్తూ.. చండీపురా వైరస్‌తోపాటు ఇతర సంబంధిత వ్యాధికారకాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రయోగశాల పరీశీలనలు పూర్తయ్యే వరకు ఎ లాంటి తుది నిర్ణయానికి రావద్దని అధికారులు స్పష్టం చేశారు.

2024లో గుజరాత్‌లో చండీపురా వైరస్ వ్యాప్తి నుంచి నేర్చుకున్న పాఠాలను కూడా ప్రస్తుత పరిశీలనల్లో పరిగణనలోకి తీసుకుంటున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష

**ప్రజలకు మెరుగైన వైద్య, విద్య, తాగునీరు, సంక్షేమ సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ.**




సంగారెడ్డి, ఆగస్టు 7: (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాల యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల్లో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, వాటి అమలు తీరు, పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

**వైద్య, ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి:**

సంగారెడ్డి జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను మంత్రి సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్ స్థానంలో మరొక వ్యక్తి నకిలీ వైద్యుడిగా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

కంకోల్, సింగీతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారు లతో చర్చించారు. బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల కేసుల పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక వసతులు, ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు.

**నర్సింగ్ కళాశాల, ఆసుపత్రుల ప్రారంభానికి చర్యలు:**

సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ మాతా శిశు ఆరోగ్య కేంద్రాలను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశిం చారు.

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో అందుతున్న వైద్య సౌకర్యాలపై సమీక్షించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా కేంద్ర ఔషధ నిల్వ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ:**

జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి సమీక్షించారు. జిల్లాలో సుమారు లక్షా ముప్పై వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు.

కంది, పటాన్‌చెరు, సంగారెడ్డి మండలాల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు.

పాఠశాలల్లో తాగునీరు, డ్రైనేజీ, మరుగు దొడ్లు వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

**సంక్షేమ హాస్టళ్ల పనితీరు మెరుగుపరచాలి:**

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సంక్షేమ హాస్టళ్ల పనితీరును మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు:**

కొత్త రేషన్ కార్డుల జారీ అంశంపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**తాగునీటి సరఫరాపై ముందస్తు కార్యాచరణ:**

జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. మంజీర, సింగూరు ప్రాజెక్టుల్లో నీటి మట్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోరంచ, భూచారెడ్డిపల్లి ఇంటెక్ వెల్‌ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాపై వివరాలు తెలుసుకున్నారు.

రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

మెదక్ జిల్లాలో 876 గ్రామాలు, సంగారెడ్డి జిల్లాలో 852 గ్రామాలు, 9 మున్సిపాలిటీలు, అలాగే జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని 472 గ్రామాలకు మెరుగైన తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రజలకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో, సమర్థవంతంగా అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.





You are Cordially invited to the
Book Releasing function of

"KOMARAM BHEEM", "THE BOND", "BANDHAM"

Novels by: Sri S.M. Pran Rao

On 13th August, 2026 at 4:00 pm

Venue: Bhagawan Mahaveer Auditorium,
State Museum, Public Gardens, Hydeerhad

President: Prof. R. Sayanna, Former Vice Chancellor, Kakatiya University

Chief Guest: Prof. Kodandaram, Hon'ble MLC

Eminent Guest: Prof. K. Arjun Rao, Director, Dept. of Heritage Telangana (Formerly Archaeology & Museums)

Guests of Honor:
Prof. Pruthviraj, Former Registrar, Dr. BRAOU, Hyd
Sri Allani Sridhar, Popular Cine Director
Sri Chintapatla Sudarshan, Popular Writer & Critique
Sri Koora Chidambaram, Popular Writer & Critique
Sri S.M. Pran Rao, Writer

Invited by
Naresh Kaluvakota
Convenor

The Students of Sri S.M. Pran Rao (1973-76 batch GJC, Nizamabad)


# ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ, డిజిటల్ విద్య

న్యూఢిల్లీ, ఆగష్టు 7:విద్యార్థుల్లో కీలక నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠ్యాంశాలు, బోధనా విధానాల్లో సమగ్ర మార్పులు చేపట్టాలని జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 నిర్దేశించింది. ఇందులో భాగంగా వివిధ విద్యా దశల్లో కృత్రిమ మేధ, డిజైన్ థింకింగ్, సమగ్ర ఆరోగ్యం, సేంద్రీయ జీవన విధానం, పర్యావరణ విద్య, ప్రపంచ పౌరసత్వ విద్య (జీసీఈడీ) వంటి సమకాలీన అంశాలను పాఠ్యాంశాల్లో ప్రవే శపె ట్టాలని ఎన్ఈపీ-2020 స్పష్టం చేసింది.

భవిష్యత్తు లో అభివృద్ధితో పాటు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారత్ ప్రపంచ నాయకత్వం సాధించాలంటే గణితం, గణితపరమైన ( కంప్యూటేషనల్) ఆలోచనా విధానం అత్యంత కీలకమని కూడా జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020లోని పేరా 4.25 పేర్కొంది ఆ విధంగా పాఠశాల విద్య పునాది దశ నుంచే గణితం, కంప్యూటేషనల్ ఆలోచనా విధానానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఈపీ -2020 సూచించింది.

ఇందు కోసం గణిత అభ్యాసాన్ని ఆసక్తి కరంగా, ఆనందదాయకంగా మార్చే పజిల్స్, ఆటలు వంటి వినూత్న బోధనా విధానాలను విస్తృతంగా వినియోగించాలని పేర్కొంది. మాధ్యమిక విద్యా దశ నుంచే విద్యార్థులకు కోడింగ్ కార్యకలాపాలను పరిచయం చేయాలని కూడా సిఫార్సు చేసింది.

పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్యప్రణాళిక (ఎన్సీఎఫ్ ఎస్ఈ) 2023 కింద విద్యార్థులకు, సమాజానికి ప్రపంచస్థాయిలో గణిత విద్య ప్రాముఖ్యత గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది.

కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, వాతావరణ నమూనాల రూపకల్పన, మౌలిక సదుపా యాల అభివృద్ధి వంటి అనేక కీలక రంగాలతో గణితానికి ఉన్న సన్నిహిత సంబంధం దృష్ట్యా, భారత్ తో పాటు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగ మించడంలో గణిత బోధన పాఠశాల విద్యలో అత్యంత కీలకమైన అంశమని ఎన్సీఎఫ్ - ఎస్ఈ, 2023 పేర్కొంది.

కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్, డేటా విజువలైజేషన్ వంటి సాంకేతికతలు విద్యారంగంలో వినూత్న అనువర్తనాలకు దోహద పడతాయని కూడా ఎన్సీఎఫ్ ఎన్ఈ -2023 పేర్కొంది. బోధన, అభ్యాస, మూల్యాంకన ప్రక్రియలను మెరుగుపరచడానికీ, ఉపాధ్యాయుల సన్నద్ధతను, వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికీ, విద్యావకాశాల లభ్యతను పెంచడానికీ విద్యా ప్రణాళిక, నిర్వహణ, పరిపాలనను క్రమబద్ధీకరించడానికీ కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో పాటు ఇమ్మర్సివ్ (ఏఆర్/ వీఆర్/ వర్చువల్ ల్యాబ్‌లు), ఇంటరాక్టివ్, గేమిఫైడ్ కంటెంట్‌ను ఉపయోగించుకోవడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి.

విద్యారంగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులకు బాటలు వేస్తోంది. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధన, తెలివైన మూల్యాంకనం, పరిస్థితులకు తగ్గ బోధనా విధానాలు, డేటా ఆధారిత నిర్ణయాలకు ఏఐ దోహద పడుతోంది.

21వ శతాబ్దంలో ఏఐని అత్యంత కీలక సాంకేతిక తగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ?2020, ఎన్సీఎఫ్ - ఎస్ఈ - 2023 ద్వారా పాఠశాల విద్యలో గణనాత్మక ఆలోచన విధానం, కృత్రిమ మేధను సమగ్రంగా అనుసంధానించేందుకు చర్యలు ప్రారంభించింది.

దీనికి అనుగుణంగా, జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)తో కలిసి 2026?27 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రత్యేక కంప్యూటేషనల్ థింకింగ్, కృత్రిమ మేధ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది.

# న్యూఢిల్లీలో పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశం...

న్యూఢిల్లీ, ఆగష్టు 7:కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ అధ్యక్షతన పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖకు చెందిన పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించారు. మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణ (హెచ్‌డబ్ల్యూసీ) అంశంపై ఈ సమావేశంలో చర్చోపచర్చలు జరిపి, ప్రజలకు వన్యజీవులకు మధ్య సంఘర్షణలను నివారించడం, తగ్గించడం, దీర్ఘకాలిక సహ-జీవనాన్ని పెంపొందింప చేయడం కోసం ఏయే చర్యలను చేపట్టవచ్చో పరిశీలించదలచారు. సమావేశంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్‌తో పాటు కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంపీలు, మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు, పీసీసీఎఫ్‌లు, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్లు పాల్గొన్నారు.

గత సంవత్సరం డిసెంబరు 18న నిర్వహించిన కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా తీసుకున్న చర్యల్ని ప్రస్తుత సమావేశంలో ప్రస్తావించారు. సంఘర్షణ వల్ల ప్రభావితమైన ప్రాంతాలు గల రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎంపీలతో జరిపిన సంప్రదింపుల వివరాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న సంఘర్షణల తీరుతెన్నులు విభిన్నంగా ఉన్నాయని, వాటిలో అనేక రాష్ట్రాల్లో మనుషులకు, ఏనుగులకు మధ్య తరచు సంఘర్షణ జరిగాయని, పులులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు, ఖడ్గమృగాలు, అడవి పందులు, అడవి దున్నలు, కోతులు ఇతర ప్రజాతులతో ముడిపడిన సంఘర్షణల విషయంలో నిర్దిష్ట ప్రాంతం వారీ నిర్వహణ విధానాల్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

వన్యప్రాణుల జాతీయ మండలి ఏడో సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి ప్రకటించిన మేరకు కోయంబత్తూరులో ని ఎస్ఏసీఓఎన్ డబ్ల్యూఐఐ సౌత్ సెంటర్‌లో 'మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణ సంబంధిత ఎక్సలెన్స్ సెంటర్' (సీఓఈ-హెచ్‌డబ్ల్యూసీ)ని ఏర్పాటు చేసిన విషయాన్ని కమిటీకి తెలియజేశారు. మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణను ప్రభావవంతంగా అదుపు చేయడానికి శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక నవకల్పన, విధానపరమైన మద్దతు, సామర్థ్యాల పెంపు, సముదాయ ఆధారిత దృష్టికోణాలను అనుసరించడానికి ఒక జాతీయ సంస్థగా ఈ కేంద్రాన్ని స్థాపించారు. సంఘర్షణతో ముడిపడిన ఘటనల నమోదు, డేటా నిర్వహణ, జ్ఞ?నాన్ని పంచుకోవడం, నిర్ణయాల సమర్థన కోసం ఒక ఏకీకృత డిజిటల్ వేదికగా 'మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణ సంబంధిత జాతీయ పోర్టల్'ను గత నెల 10న ప్రారంభించిన సంగతిని కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంది. దక్షిణ భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఏనుగుల సంరక్షణకు సంబంధించిన ప్రాంతీయ కార్యాచరణ ప్రణాళిక (ఆర్ఏపీ)కి ఆమోదం తెలిపిన విషయాన్ని కూడా కమిటీకి తెలియజేశారు.

అస్సాం, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు తమ ప్రాంతాల్లో సంఘర్షణ స్థితిగతులు, వాటిని తగ్గించే దిశగా చేపడుతున్న చర్యలు, సాముదాయిక భాగస్వామ్య ప్రధాన కార్యక్రమాల నిర్వహణ, సాంకేతికతను ఉపయోగించడం, సంస్థాగత యంత్రాంగాలతో పాటు జాతీయ స్థాయిలో ప్రయత్నాలును బలోపేతం చేయడానికి తమ సిఫార్సులను సమర్పించాయి. ఫలానా ప్రాంతాల్లో అమలు చేయదగిన ప్రణాళికలు, త్వరితగతిన ప్రతిస్పందించడం, సహజ స్థలాలను మెరుగుపరచడం, వన్యప్రాణి కారిడార్ల సంరక్షణ, శాస్త్రీయ పద్ధతుల్లో పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సాముదాయిక భాగస్వామ్యంతో పాటు రాష్ట్రాల మధ్య పరస్పర సమన్వయం.. వీటికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ అనుభవాలు స్పష్టం చేశాయి.

మనుషులు-వన్యజీవుల సంఘర్షణను ప్రభావవంతంగా అదుపు చేయడానికి పర్యావరణ సంరక్షణతో మానవ జీవన పరిరక్షణ, జీవనోపాధి మార్గాల పరిరక్షణలను అనుసంధానించడం అవసరమని చర్చల్లో స్పష్టం చేశారు. జీఐఎస్, కృత్రిమ మేధ, డ్రోన్లు, రేడియో టెలిమెట్రీ, భవిష్యత్తు సూచక విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించుకోవడంపై సభ్యులు చర్చించారు. ముందు వరుసలో నిలిచే వారి సామర్థ్యాన్ని పెంచడం, పరిహారం అందజేత పద్ధతుల్ని మెరుగుపరచడం, ప్రజలలో చైతన్యాన్ని పెంపొందింప చేయడం, సంరక్షణలో సాముదాయిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని సూచించారు.

ఆరు రాష్ట్రాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి:

అస్సాం: ఏనుగులు, పులులు, చిరుతలు, ఖడ్గమృగాలు, అడవి దున్నలు, అడవి పందుల ప్రమేయం గల మానవులు-వన్యప్రాణుల సంఘర్షణలను తగ్గించే విషయంలో అస్సాం ప్రభుత్వం తాను అనుసరిస్తున్న వ్యూహాన్ని వెల్లడించింది. ఆయా ప్రాంతాలలో అమలు చేసేందుకు ఉద్దేశించిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి 'ప్రాంతీయ మానవ-వన్యప్రాణి సంఘర్షణ తాలూకు రిస్కును తగ్గించే సంఘాల' (జోనల్ హ్యూమన్-వైల్డ్‌లైఫ్ కాన్‌ఫ్లిక్ట్ రిస్క్ రిడక్షన్ కమిటీస్) ఏర్పాటు చేస్తామని ఈ రాష్ట్రం ప్రస్తావించింది. ఈ ప్రణాళికలను రూపొందించడంలో సహజ నివాస స్థలాల (హాబిటాట్స్) పునరుద్ధరణ, కారిడార్ సంరక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, శీఘ్ర స్పందన, సాముదాయిక భాగస్వామ్యం, వివిధ రీతుల జీవనోపాధులపై దృష్టిని కేంద్రీకరిస్తానంది. జోన్‌వారీ ప్రణాళిక పద్ధతిని కమిటీ ప్రశంసించింది. సంఘర్షణ ప్రభావం ప్రసరిస్తున్న ఇతర భూభాగాల్లోనూ ఈ పద్ధతిని అనుసరించడానికి వీలుగా, ఈ పద్ధతిలో రాబట్టిన ఫలితాల్ని నమోదు చేయాలని (డాక్యుమెంటేషన్) సూచించింది.

కర్ణాటక: మానవులు-వన్యప్రాణుల మధ్య సంఘర్షణలను నియంత్రించడానికి కర్ణాటక తాను అమలు చేస్తున్న ఆరు విధాల నమూనాను గురించి వివరించింది. ఇంజినీరింగ్ సాయాన్ని తీసుకోవడం, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ, కమాండ్ సెంటర్లు, శీఘ్ర స్పందన బృందాలు, కమ్యూనిటీ వాలంటీర్ నెట్‌వర్కులతో పాటు ఈ-పరిహార పేరిట డిజిటల్ నష్టపరిహార వ్యవస్థలను ఏర్పాటు చేయడం ఈ నమూనా ప్రత్యేకతలు. 'నేషనల్ హ్యూమన్-వైల్డ్‌లైఫ్ కాన్‌ఫ్లిక్ట్ మిషన్', సామాన్య ప్రామాణిక కార్యకలాపాల ప్రక్రియ (కామన్ ఎస్ఓపీ)లు, కారిడార్ల పునరుద్ధరణ, సరిహద్దులకు అవతలి వైపు ఏనుగుల సంతతి నిర్వహణకు రాష్ట్రాల మధ్య బలమైన సమన్వయం.. ఇవి కూడా అవసరమని కర్ణాటక సూచించింది. సాంకేతికత ఆధారిత దృష్టికోణాన్ని కర్ణాటక అనుసరిస్తుండటాన్ని కమిటీ మెచ్చుకుంది. అత్యుత్తమ పద్ధతులను రాష్ట్రాలు అందిపుచ్చుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది.

కేరళ: ఈ రాష్ట్రం తన ఏకీకృత సంస్థాగత ప్రాథమిక ప్రణాళికను వివరించింది. ఈ ప్రణాళికలో.. మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణను 'రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రత్యేక విపత్తు' (స్టేట్-స్పెసిఫిక్ డిజాస్టర్)గా ప్రకటించడం, శీఘ్ర స్పందన బృందాలతో పాటు ప్రాథమిక స్పందన బృందాలను రంగంలోకి దింపడం, సంఘర్షణతో ప్రభావితమైన 273 పంచాయతీలను గుర్తించడం, జన జాగృతి సమితులతో పాటు ఎస్ఏఆర్‌పీఏ వాలంటీర్ కార్యక్రమం వంటి సాముదాయిక కార్యక్రమాలను అమలు చేయడం కలిసి ఉన్నాయి. వన్యప్రాణి కారిడార్ల పునరుద్ధరణ, సహజ నివాస స్థలాల నిర్వహణ,




జవాబుదారుతనంతో కూడిన పర్యటన రంగం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణలు ఎంతైనా ముఖ్యమని ఈ రాష్ట్రం కూడా స్పష్టం చేసింది. శక్తిమంతమైన సంస్థాగత, సాముదాయిక దృష్టికోణాన్ని అనుసరిస్తూ కేరళ ముందుకు సాగుతుండటాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకుంది. విజయవంతమైన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలకు కూడా తెలియజేస్తూ ఉండాయాల్సిందిగా కేరళను ప్రోత్సహించింది.

మధ్యప్రదేశ్: మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణలను తగ్గించడానికి 'నివారణే ముఖ్యం' అన్న తన నమూనాను గురించి మధ్యప్రదేశ్ ఈ సమావేశంలో తెలియజేసింది. నిఘాకు ఏఐని ఉపయోగించడం, జీపీఎస్ ట్రాకింగ్, డ్రోన్లు, 'గజరక్షక్', శీఘ్ర స్పందన బృందాలు, ప్రజాతుల వారీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లు, ఒక నిర్దిష్ట సమయం లోపల పరిహారం చెల్లింపు, 'బాఘ్ మిత్ర', 'హాథీ మిత్ర', పర్యావరణ అభివృద్ధి కమిటీల ద్వారా విస్తృత స్థాయిలో ప్రజా భాగస్వామ్యం.. ఇవి ఈ నమూనాలో భాగంగా ఉన్నాయి. హాబిటాట్ మేనేజ్‌మెంట్, వన్యప్రాణులకు స్వస్థతపరమైన సహాయం, సైన్స్ ఆధారిత ప్రజాతి నిర్వహణ పద్ధతుల్ని గురించి ఈ రాష్ట్రం కూడా ప్రస్తావించింది. సంఘర్షణతో సంబంధం ఉన్న పశువులను వేరే చోటుకు మార్చాలని సూచించింది. సాంకేతికతను ఉపయోగించుకోవడం, సాముదాయిక భాగస్వామ్యం, సకాలంలో సహాయక చర్యలను చేపట్టడం వంటి పద్ధతుల్ని పార్లమెంటరీ కమిటీ ప్రశంసించింది. ముందుగా అంచనా వేసి సంఘర్షణ నివారణ చర్యలను చేపట్టే విషయంలో మరింత అప్రమత్తతతో నడుచుకోవాల్సిందిగా కోరింది.

ఉత్తరాఖండ్: ప్రాధాన్య ప్రాంతాల్లో సంఘర్షణల తగ్గింపు దిశగా వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను అనుసరిస్తున్నట్లు ఉత్తరాఖండ్ తెలియజేసింది. ఈ ప్రణాళికలో భాగంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్, ప్రతి నిమిషం అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్ (1926 నంబరు), ఈ-నిఘా, జీపీఎస్ ట్రాకింగ్, సహజ నివాస స్థలాల పునరుద్ధరణ, బయో-ఫెన్సింగ్, సకాలంలో పరిహారం అందజేసే వ్యవస్థ, గ్రామాల్లో వాలంటీర్ నెట్‌వర్కులను ఏర్పాటు చేసినట్లు వివరించింది. వన్యజీవులతో సమస్యలు ఎదురుకాగల ప్రాంతాల విషయంలో ప్రత్యేక ప్రణాళిక, జిల్లా స్థాయి పర్యవేక్షణ సంఘాలు, 'చిరుతలతో, పులులతో కలిసి ఉండటం' కార్యక్రమంలో భాగంగా సహజీవన ఏర్పాట్లను బలోపేతం చేయడంపైన కేంద్రీకరించినట్లు ఈ రాష్ట్రం తన దీర్ఘకాలిక వ్యూహాన్ని పార్లమెంటరీ కమిటీ కి వెల్లడించింది. ఉత్తరాఖండ్ అనుసరిస్తున్న ఏకీకృత భూభాగ ప్రధాన దృష్టికోణాన్ని కమిటీ కొనియాడింది. సాంకేతికత ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సాముదాయిక సన్నాహకాలకు పెద్ద పీట వేయాలని కమిటీ స్పష్టం చేసింది.

ఉత్తరప్రదేశ్: తమ రాష్ట్రంలో మానవ-వన్యప్రాణి సంఘర్షణ కేసుల్లో ఎక్కువ భాగం చిరుతపులులకు సంబంధించినవే ఉంటున్నాయని ఉత్తరప్రదేశ్ వివరించింది. ఇవి తరాయి ప్రాంతంలో తరచు చోటుచేసుకుంటున్నాయంది. శీఘ్ర స్పందన బృందాలను, సహాయక కేంద్రాలను (ఇలాంటివి నాలుగింటి నిర్మాణం పూర్తి చేశారు), సౌర శక్తితో పనిచేసే కంచెలను, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను, సాముదాయిక వాలంటీర్ కార్యక్రమాలను, శాస్త్రీయ పర్యవేక్షణ, రక్షితప్రాంతాలకు ఆవల కూడా శక్తిమంతమైన సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఈ రాష్ట్రం తన వ్యూహాన్ని గురించి తెలియజేసింది. శాస్త్రీయ నిర్వహణపై దృష్టి సారించి రాష్ట్రం తీసుకుంటున్న శ్రద్ధను కమిటీ ప్రశంసించింది. తరచుగా సంఘర్షణలు తలెత్తుతున్న ప్రాంతాల్లో వాటిని తగ్గించే దిశగా సముదాయ ఆధారిత చర్యలను, పర్యవేక్షక వ్యవస్థలను నిరంతరాయ ప్రాతిపదికన పటిష్ఠపరచాలని సలహా ఇచ్చింది.

రాష్ట్రాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర పర్యావరణ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రశంసించారు. మనుషులు-వన్యప్రాణుల సంఘర్షణ సంబంధిత సవాలును శాస్త్రీయ పద్ధతిలో, సంస్థల మధ్య సమన్వయంతో, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణతో, స్థానికుల భాగస్వామ్యంతో, సమతౌల్య దృక్పథంతో అధిగమించాలని ఆయన సూచించారు. డేటా ఆధారిత వ్యూహాలను రచించడంలోనూ, జ్ఞ?నాన్ని ఇచ్చిపుచ్చుకొనే ప్రక్రియను సులభతరంగా మార్చడంలోనూ, రాష్ట్రాలు అత్యుత్తమ పద్ధతులను అనుసరించడంలోనూ తోడ్పడటానికి ఒక ప్రధాన సంస్థాగత ప్రాథమిక ప్రణాళికను మానవ-వన్యప్రాణి సంఘర్షణ సంబంధిత జాతీయ పోర్టల్, ఎక్సలెన్స్ సెంటర్ అందిస్తాయని ఆయన తెలిపారు. అంతకు ముందు, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ సింగ్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. సహజ నివాస స్థానాల ఆధారిత శాస్త్రీయ అధ్యయనాన్ని చేపట్టి వాటి సామర్థ్యాన్ని అంచనా వేయాలని, దీని వల్ల వన్యజీవుల సంతతి మనుగడకు తగినన్ని వనరులు విస్తారిత అనుబంధ వ్యవస్థ (ఇకోసిస్టమ్)లో ఉన్నాయో లేదో తెలుసుకోవచ్చని ఆయన అన్నారు. ఇది వనరులను పెంపొందించడానికి, మానవులు-వన్యప్రాణుల సంఘర్షణను అదుపు చేయడానికి మెరుగైన వ్యూహాన్ని రూపొందదించడంలోనూ తోడ్పడుతుందని ఆయన అన్నారు.

# స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఆర్డీవోకు వినతి

హైదరాబాద్, ఆగష్టు 7: వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో విద్యా ర్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొని తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచుకున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి.

"పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. . ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. ఆమె దివాకర్ల వేంకటవధాని శిష్యురాలు. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో "మహాలక్ష్మి ముచ్చట్లు" అని వినిపించేది.

యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 – అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల

యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు" అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాష తో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో



ఆగస్టు 8...పాకాల యశోదారెడ్డి జయంతి

వాటిలోని కళానైపుణ్యాన్ని, వైభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉ స్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది.

ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920-40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950-70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980-1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు.

యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి.

ఎచ్చమ కథలకు ముందుమాటలో "ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది.

ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారవే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు.

యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ' ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు.

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు.

ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## రూ.28 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్,7 (నేటినిజం ప్రతినిధి). కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీలో రూ.28 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సాధినేని మునీందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం




కరీంనగర్,7 (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ నగరంలోని 39వ డివిజన్‌లో ఉన్న చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై స్వయంగా నేయడం ద్వారా మగ్గం పనితీరును తెలుసుకుని, చేనేత కార్మికుల అద్భుతమైన కళానైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత కార్మికుల ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడానికి, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆ కృషిలో భాగంగానే 2015 ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమంలో చేనేత కార్మికులు అందించిన సేవలు చారిత్రాత్మకమైనవని కొనియాడారు. చేనేత రంగం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, సభ్యులను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, తెళ్ళ లక్ష్మి రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, బీజేపీ నాయకులు గుంజేటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు ,మహిళలు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వానాకాలం పంటలకు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల



కామారెడ్డి, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి)పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుని పొంగిపొర్లు తుండడంతో వానకాలం పంటల సాగు కోసం ఇరిగేషన్ శాఖ అధికారులు స్థానిక నాయకులతో కలిసి ప్రాజెక్టు గేట్లను శుక్రవారం ఎత్తి 150 క్యూసెక్కుల నీరు దిగువ విడుదల చేశారు. ప్రాజెక్టు కెపాసిటీ 1.820.టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుకొని పొంగిపొర్లుతోంది.

దీంతో చెరువులు కుంటలు నిండుకుంటాయని నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

విడుదల చేసిన నీరు 15 రోజులపాటు దిగువకు వెళతాయని ఆ తర్వాత పది రోజులపాటు నిలుపుదల ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

## నారాయణఖేడ్‌లో గుట్టల విధ్వంసం.. మట్టి మాఫియా ఆగడాలు!

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం.. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి.

సంగారెడ్డి ఆగస్టు 7(నేటి నిజం ప్రతినిధి ) నారాయణఖేడ్ నియోజకవర్గంలో ప్రకృతి అందాలను ప్రతిబింబించే గట్టులు, గుట్టలు, రాళ్లు, మట్టిని అక్రమంగా తవ్వుతూ మట్టి మాఫియా యథేచ్ఛగా దోచుకుంటోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిప్రి, అనంతసాగర్, రుద్రారం గ్రామాల శివార్లలో జేసీబీలతో పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం, ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు రాజకీయ అండదండలతో గుట్టలను మాయం చేసి మట్టి, రాళ్లను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని చెబుతున్నారు. ఒక ట్రాక్టర్ మట్టిని తరలిస్తే సుమారు రూ.2 వేల వరకు ఆదాయం వస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు.

అక్రమ తవ్వకాల కారణంగా సహజ జల ప్రవాహ మార్గాలు దెబ్బతింటున్నాయని, వర్షపు నీరు నిల్వ కాకుండా కిందికి పారిపోవడంతో భూగర్భ జలాలు క్రమంగా అడుగంటిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి కొరత తీవ్రంగా ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఇంత జరుగుతున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు అనేక గుట్టలు ఇప్పటికే పూర్తిగా తవ్వివేయబడగా, మిగిలిన వాటినీ మాఫియా లక్ష్యంగా చేసుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలపై తక్షణమే అరికట్టి , బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రకృతి సంపదను కాపాడేందుకు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేసులు పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



మంచిర్యాల ఆగష్టు 7: ప్రభుత్వ అక్రమాలపై నిలదీసిన ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడమే అధికార కాంగ్రెస్ లక్ష్యమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఘటనకు సంబంధించిన కేసులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలసి కోర్టుకు హాజరైన అనంతరం ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీలో మెజారిటీ లేకపోయినా అధికార పార్టీ ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించి చైర్మన్ ఎన్నికను ప్రభావితం చేసిందని ఆరోపించారు. ఆ సమయంలో పోలీసు శాఖ కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని, తమ పార్టీ కౌన్సిలర్లను స్వేచ్ఛగా వ్యవహరించనివ్వలేదని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తప్పు చేయకపోయినా రాజకీయ కక్షతో కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ వేధింపులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారికి తగిన సమాధానం ఇస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ మాజీ వైస్ జడ్పీ చైర్సన్ మూల రాజీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజరమేష్, టీబీజీకేఎస్ నాయకులు మెడిపెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు దరఖాస్తు చేస్తుకోవాలి

ములుగు, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి) ములుగు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్)లో బోధన, బోధనేతర ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో సిద్ధార్థరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌టీ, ఇతర ఉపాధ్యాయ పోస్టులు సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఉన్నాయని, ములుగు జిల్లాకు చెందిన స్థానిక అభ్యర్థులు డీఈవో కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441069654 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## భావోద్వేగానికి గురికాలేదు: కాళేశ్వరం అర్చకులు



ములుగు, ఆగష్టు 7:(నేటినిజం ప్రతినిధి) ఆలయ పునర్నిర్మాణంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన అర్చకులు ఖండించారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయ కూల్చివేత నేపథ్యంలో అర్చకులు భావోద్వేగానికి గురయ్యారని, పునర్నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి తాము పూర్తి మద్దతు తెలుపుతున్నామని, కృష్ణశిలతో శాశ్వత రాతి కట్టడంగా ఆలయం నిర్మాణం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి అనుమతి, ఆశీస్సులతోనే శాస్త్రోక్తంగా పునర్నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జూన్ 16న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, విలేకరుల సమావేశం (ఖతీవబబ ఓవవబి) నిర్వహించి పునర్నిర్మాణ వివరాలను వెల్లడించామని, జూన్ 17న కళాపకర్షణ, ద్వారబంధనం నిర్వహించి ఆదిముక్తీశ్వర స్వామి ఆలయంలో బాలాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నిత్యాభిషేకాలు, నిత్యార్చనలు, కాలసర్ప దోష నివారణ, శని (నవగ్రహ) పూజలు యథావిధిగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

రూ.198 కోట్లతో ప్రభుత్వం కాళేశ్వర క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని, శిథిలావస్థకు చేరిన 1982 నాటి గర్భాలయ స్థానంలో కృష్ణశిలతో శాశ్వత రాతి కట్టడాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. భక్తులు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, దేవస్థానం అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పనగంటి ఫణీంద్ర శర్మ, ముఖ్య అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, అర్చకులు గట్టు రాము, రామకృష్ణ, శరత్ చంద్ర శర్మ, పవన్ శర్మ, విజయ్ శర్మ, రాజు శర్మ, ఫణి శర్మ, రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.






Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.